Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 319 | హైదరాబాద్ | సోమవారం 05 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR

బీసీ సీఎం ఖాయం

రాహుల్, ఖర్గే ఇచ్చిన ధైర్యంతో ఈ మాట చెప్తున్నా



- అవసరమైతే బీసీలకు రావాల్సిన వాటాను లాక్కుంటాం
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలు.. మోడీ, షాతో మాట్లాడే సత్తా లేదు
- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కుల సర్వే నిర్వహిస్తాం
- పీసీసీ ఓబీసీ బహిరంగ సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- కులగణనతో సామాజిక న్యాయం : మంత్రి పొన్నం ప్రభాకర్

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన 'ఎవరెంతో వారికి అంత' నినాదం బీసీల హక్కుల సాధనకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కులాలు, ప్రాంతాలకు అతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి రావాలని సూచించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే పోయేదేమీ లేదని, భవిష్యత్ తరాల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రజాతీర్పు)

తెలంగాణకు భవిష్యత్తులో బీసీ ముఖ్య మంత్రి కావడం ఖాయమని బీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యాన్ని రాహుల్‌గాంధీ కల్పించారని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇచ్చిన భరోసాతో రాష్ట్రానికి బీసీ సీఎం వస్తారని చెబుతున్నానన్నారు. బీసీలకు దక్కాల్సిన వాటా సాధించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అవసరమైతే తమ వాటాను లాక్కునైనా సాధించుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఆదివారం బీసీసీ ఓబీసీ ఆధ్వర్యంలో శంషాబా ద్‌లోని గొల్లపల్లి ఎక్స్ రోడ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు .రాహుల్‌గాంధీ భారత్ జోడో

-2వ పేజీలో



విమానాన్ని ఎలాగైనా కూల్చాలనుకున్నా..

- చావంటే భయం లేదు
- విచారణలో ఫ్లైదుబాయ్ కోపైలట్ అల్-హమ్మామీ

ముంబయి, దుబాయ్, అక్టోబరు 04

చావంటే తనకు భయం లేదని, విమానాన్ని ఎలాగైనా కూల్చాలనే అనుకున్నానని ఫ్లైదుబాయ్ కోపైలట్ హమామ్ అల్-హమ్మామీ వెల్లడించాడు. యూఏఈలో అతడిని విచారిస్తున్న అధికారులు.. సామాజిక మాధ్యమాల్లో అతడి స్పందనలు, గత ఘటనలు చూసి.. వివిధ కోణాల్లో మరింత సమాచారం రాబడుతున్నారు. ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితుడైన అతడు గత బుధవారం దుబాయ్-టెల్‌అవీవ్ విమానంలో విధులు నిర్వర్తిస్తూ పైలట్ స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఒమన్ జాతీయుడైన

-2వ పేజీలో





ఆఖరి పోరాటం చేశా

- హమ్మామీని వదలరాదని అనుకున్నా
- ఘాతుకాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వివరించిన మచ్చర్
- కాక్‌పిట్‌లో దాడి జరిగినప్పుడు గాయాలతో మచ్చర్

ముంబయి, దుబాయ్, అక్టోబరు 04

కోపైలట్ తనపై తీవ్రంగా దాడి చేస్తున్నప్పుడు ఒక్క క్షణం నివ్వెరపోయినా వెంటనే తేరుకున్నానని, ఆఖరి పోరాటం చేశానని కెప్టెన్ స్మిత్ మచ్చర్ చెప్పారు. తీవ్ర గాయాలపాలై యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్‌తో శనివారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్లో మాట్లాడిన విషయం తెలిసిందే. పైలట్‌ను ప్రపంచ హీరోగా కీర్తించి, తమ దేశ స్వాతంత్ర్య వేడుకలకు

-2వ పేజీలో



జ్ఞానేశ్ రాజీనామా చేసి వెళ్లిపో

బీజేపీ చేతిలో నువ్వు ఓ ఆయుధం

- అధికారం ఎవరికనేది ప్రజలు నిర్ణయిస్తారు
- ఈసీకి వ్యతిరేకంగా ముంబైలో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే సంయుక్త ర్యాలీ

ముంబై, అక్టోబరు 04

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు



అభివృద్ధినే ఆదరిస్తారు

- పనులు చేసిన వారినే ప్రజలు గుర్తిస్తారు
- మైనారిటీల సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్
- 4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని మోసం: మాజీ మంత్రి హరీశ్‌రావు
- గజ్వేల్‌లో కాశ కార్మికులకు పనిముట్ల పంపిణీ

గజ్వేల్, అక్టోబరు 04 (ప్రజాతీర్పు)

కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజల కండ్లముందే కనిపిస్తున్నదని, పనులు చేసిన వారినే ప్రజలు గుర్తిస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ తురక కాశ సంక్షేమానికి చేయూత కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజక వర్గంలోని 90 మంది కాశ కార్మికులకు స్టోన్ కటింగ్

-2వ పేజీలో

ఓటు హక్కు హరించడాన్ని సమర్థించలేం

- ఓటుహక్కు పౌరసత్వానికి అత్యంత ప్రాణప్రదం
- కోట్లాది మందిని ఓటు హక్కుకు దూరం చేయడం రాజ్యాంగ విరుద్ధం
- నోటీసు ఇవ్వకుండా తొలగించరాదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

హైదరాబాద్, అక్టోబరు 04 (ప్రజాతీర్పు)

భారతీయ పౌరుడి ఓటుహక్కు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని, కోట్లాది మంది ఓట్లను దూరం చేసే ఏ ప్రక్రియ అయినా పూర్తిగా ఏకపక్షమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పష్టం చేశారు. అటువంటి చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు), 326 (వయోజన ఓటు హక్కు)లను స్పష్టంగా ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 19వ నల్సార్-జస్టిస్ బీఆర్ సాహ్నా మెమోరియల్ మూట్ కోర్టు పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగం పౌరులను ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలుగా విభజించడాన్ని అంగీకరించదని జస్టిస్ భూయాన్ అన్నారు. 'ఏదైనా ఒక ప్రక్రియ కారణంగా దేశంలోని కోట్లాది మంది పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయి, సొంత దేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతే, అలాంటి ప్రక్రియ సహజంగానే అత్యంత ఏకపక్షమైనది. ఎలాంటి సాకులు లేదా ఏ ఇతర వాదనలు దీన్ని సమర్థించలేవు. ఇది రాజ్యాంగ మూలాలనే దెబ్బతీస్తుంది' అని వ్యాఖ్యానించారు.

ఓటు హక్కు.. పౌరసత్వానికి అసలైన ప్రాణం

'నిజానికి, ఓటు హక్కు అనేది పౌరసత్వానికి అసలైన ప్రాణం. దేశ పాలనా వ్యవస్థలో ఒక సామాన్య పౌరుడు భాగస్వామి కావడానికి ఉన్న ఏకైక మార్గం ఇదే. ఆర్టికల్ 326ను ఎవరూ మార్చలేరు. ఏ అధికార సంస్థ కూడా ఇలా చేయలేదు. ఏ కోర్టు కూడా దీన్ని క్షమించదు. రాజ్యాంగానికి అతీతులు ఎవరూ లేరు'

-2వ పేజీలో





దిల్లీలో ఉద్రిక్తత

- జంతర్ మంతర్‌వైపు దూసుకొచ్చిన ఏఐఎస్ఏ కార్యకర్తలు
- నేహా బోరా నిర్బంధం.. విడుదల
- సీఈసీ రాజీనామా డిమాండుతో కొనసాగుతున్న నిరసనలు

దిల్లీ, అక్టోబరు 04 (ప్రజాతీర్పు)

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండు చేస్తూ దేశ రాజధాని దిల్లీలో నిరసనల ఉద్ధృతి కొనసాగుతోంది. ఈ డిమాండుతో వరుసగా

-2వ పేజీలో



ఎస్ఎల్‌బీసీలో

క్లిష్ట దశను అధిగమించాం



- బలహీన శిలల జోన్‌ను దాటిన సొరంగ తవ్వకాలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచన
- ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష

హైదరాబాద్,అక్టోబరు 04 (ప్రజాతీర్పు)

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల జోన్‌ను దాటి ముందుకు వెళ్లడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. అదనపు యంత్రాలను రంగంలోకి దించాలని, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని

-2వ పేజీలో

బీసీ సీఎం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

యాత్రలో ఇచ్చిన 'ఎవరెంతో వారికి అంత' నినాదం బీసీల హక్కుల సాధనకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కులాలు, ప్రాంతాలకు అతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి రావాలని సూచించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే పోయేదేమీ లేదని, భవిష్యత్ తరాల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి పైగా సర్పంచ్ పదవులు, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం సీట్లు బీసీలకు దక్కేలా చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మంత్రివర్గం, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లలో బీసీల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుతామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సహకారంతో తెలంగాణలో కులగణన నిర్వహించి దాని వివరాలతో డాక్యుమెంట్ రూపొందించామన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందన్నారు. కుల సర్వే సక్రమంగా సాకారమై ఉంటే యావత్ దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వేలో పదో కాలమ్ వరకు ఎస్సీ, ఎస్టీల వివరాలకు ప్రాధాన్యం ఇచ్చి, ఓబీసీలకు సంబంధించిన కాలమ్‌ను తొలగించారని ఆరోపించారు. బీసీలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలని, వారికి ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి ప్రశ్నించే సత్తా, ధైర్యం లేదన్నారు. తెలంగాణ నుంచి వస్తున్న బీసీ హక్కుల నినాదం కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. మోడీ ప్రభుత్వం గద్దె దిగే సమయం ఆసన్నమైందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. బీసీ ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదని, తమ హక్కుల కోసం చేస్తున్న న్యాయమైన పోరాటమన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర కులగణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా కులగణన కోసం గ్రామస్థాయి నుంచి ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. సమావేశాలు, ప్రజాసభలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రెస్‌కాన్ఫరెన్స్‌ల ద్వారా కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనేక వెనుకబడిన వర్గాలకు ఇప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. ప్రతి సామాజిక వర్గం జనాభా, సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై ప్రామాణిక గణాంకాలు ఉంటేనే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని సమర్థంగా నిర్ణయించగలమన్నారు. తెలంగాణలో కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ తీర్మానం చేసిందని, దీనిపై ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టిందని తెలిపారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితి సహా పలు అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సి ఉందన్నారు. శాసనసభ తీర్మానాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లి గ్రామసభల్లో కులగణనకు అనుకూలంగా తీర్మానాలు చేయించి కేంద్రంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కులగణన కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి తెలంగాణ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కులగణన సామాజిక న్యాయానికి పునాది అని, అన్ని వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ ఎమ్మెల్యే శంకరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

విమానాన్ని ఎలాగైనా కూల్చాలనుకున్నా..

(మొదటి పేజీ తరువాయి)

అల్-హమ్మామీ యూఏఈ, ఒమన్, సిరియా, మొరాకోల్లోనే కాకుండా ఆస్ట్రేలియాలోనూ విద్యార్థిగా రెండేళ్లు (2015-17) ఉన్నట్లు తెలుస్తోంది. 2019లో అతడు ఏ కోర్సులోనూ లేకపోవడంతో విద్యార్థి వీసా రద్దయింది. హమ్మామీ ఆన్‌లైన్ కార్యకలాపాలపైనా నిశిత పరిశీలన మొదలైంది. ఎక్స్ ఖాతాను అతడు తొలగించినా దానిలో 3వేల పోస్టుల స్క్రీన్‌షాట్లను దర్యాప్తు అధికారులు రాబట్టగలిగారు. మహిళలు ఉద్యోగాలు చేయకూడదని, ముఖానికి ముసుగు ధరించే మహిళలకు పెద్దపీట వేయాలని చెప్పే పోస్టులు దీనిలో ఉన్నాయి. విమానాలు నడపడమంటే తనకెంతో మక్కువని అరబిక్ భాషలో రాసుకొచ్చాడు. మరోవైపు దాడిని అతనొక్కడే నిర్వహించాడని ప్రాథమిక దర్యాప్తు చెబుతోంది. ఏదైనా ముఠా, సంస్థకు సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు దొరకలేదని ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి.

వివరాలన్నీ ముందే అందించామన్న యూఏఈ

విమాన సిబ్బంది ఏయే దేశాలకు చెందినవారు, ప్రయాణికుల జాబితా వంటివి యూఏఈ అధికారులు ఇజ్రాయెల్‌కు తెలియపరిచారని, ఏ ఒక్కరిపైనా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంకాలేదని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల్లేని ఒమన్‌కు చెందిన వ్యక్తిని ఇజ్రాయెల్ పౌరులున్న విమానం నడిపేందుకు ఎలా అనుమతించారనే ప్రశ్నల నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చారు.

అమెరికా, ఇజ్రాయెల్ విమానాలే లక్ష్యం: అల్ ఖైదా

అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రయాణికుల విమానాలే లక్ష్యంగా దాడులకు తెగబడాలంటూ అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్ ఖైదా పిలుపునిచ్చింది. ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ జరిపిన భయానక దాడిని ప్రశంసిస్తూ అల్ ఖైదా మద్దతుదారులు ఒక ప్రకటన చేశారు. 9/11 దాడులను గుర్తు చేస్తూ 'అమెరికా అనే చెడ్డ సామ్రాజ్యం' అంతమయ్యే రోజు దగ్గరలోనే ఉందని స్పష్టం చేశారు. అమెరికన్లు, ఇజ్రాయెలీలు ప్రయాణించే విమానాలను 9/11 తరహాలోనే లక్ష్యంగా చేసుకోవచ్చని అల్ ఖైదా మద్దతుదారులు నడుపుతున్న 'అల్-బయాన్' వారపత్రిక పేర్కొంది. యుద్ధం ఇంకా ముగియలేదని ప్రకటించింది.

ఎస్ఎల్‌బీసీలో క్లిష్ట దశను అధిగమించాం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగంతో పాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై ఆదివారం ఆయన సమీక్షించారు. గత ఐదారు నెలల్లో 700 మీటర్ల మేర సొరంగం తవ్వకాలు జరిగాయని ప్రాజెక్టు అధికారులు మంత్రికి వివరించారు. అవుట్‌లెట్ వైపు నుంచి 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు నుంచి 250 మీటర్ల మేర తవ్వకాలు జరిగాయని చెప్పారు. మొత్తం 43.968 కిలోమీటర్ల సొరంగానికి గాను 79 శాతం పనులు పూర్తయ్యాయని, తవ్వకాలు మరో 9.1 కిలోమీటర్ల మేర మిగిలి ఉన్నాయని తెలియజేశారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

ఇకపై సాధారణంగా పనులు

సొరంగాల నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్‌లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన మట్టి, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల్లో మరో ప్రమాదం జరగకుండా ప్రారంభంలో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) చిక్కుకుపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన మళ్లింపు తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలాన్ని సురక్షితంగా దాటేందుకు 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో తవ్వకాలు జరిగే భాగానికి ముందుగా గొడుగు మాదిరి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలమైన రిబ్‌లను అమర్చడం, దశలవారీగా తవ్వడం, ముందున్న శిలల పరిస్థితిని తెలుసుకునేందుకు డ్రిల్లింగ్ పరీక్షలు చేయడం, అదనపు రక్షణ ఏర్పాట్లతో ప్రమాదాలను నియంత్రిస్తూ ముందుకు సాగినట్లు చెప్పారు. ప్రస్తుతం శిలల పరిస్థితి మెరుగుపడుతుండటంతో సాధారణంగా పనులు సాగించే అవకాశం ఏర్పడుతోందని తెలిపారు.

2028లో ప్రధాన సొరంగం అనుసంధానం లక్ష్యం

టన్నెల్--1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే--జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన సొరంగం, టన్నెల్--2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 8 మీటర్ల మేర..

ప్రస్తుతం రెండు వైపులా కలిపి రోజుకు సుమారు 8 మీటర్ల మేర సొరంగం తవ్వాలు జరిపినట్టు ప్రాజెక్టు బృందం తెలిపింది. ఒకట్రెండు రోజులు అది పది మీటర్లకు కూడా చేరిందని వివరించింది. అవుట్‌లెట్ వద్ద మూడు డ్రిల్లింగ్ భుజాలున్న బూమర్ యంత్రం ఇప్పటికే పనిచేస్తోందని, అక్కడి పనులు అవసరమైన వేగానికి చేరువలో ఉన్నాయని తెలిపింది. ఇన్‌లెట్ వద్ద ఇదే తరహా మరో యంత్రం అక్టోబర్‌లో అందుబాటులోకి రానుందని చెప్పింది. జర్మనీ నుంచి తెప్పిస్తున్న రైలు ఇంజిన్ (లోకోమోటివ్) అక్టోబర్ నెలాఖరుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అక్టోబర్ చివరి లేదా నవంబర్ ప్రారంభం నుంచి పనుల వేగం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

దిల్లీలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మూడో రోజు (ఆదివారం) జంతర్ మంతర్‌వైపు అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) కార్యకర్తలు దూసుకొచ్చారు. అధిక సంఖ్యలో మోహరించిన పోలీసులు, బారికేడ్లను దాటుకుని ఆంధ్ర భవన్ సర్కిల్ నుంచి జంతర్ మంతర్‌వైపు వచ్చేందుకు యత్నించారు. వారిని నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. పోలీసులు, ఏఐఎస్ఏ కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. తమ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని.. అధికారిక నంబరు ప్లేటు లేని ఓ ప్రైవేటు వాహనంలో ఆమెను తరలించారని ఏఐఎస్ఏ నేతలు ఆరోపించారు. వాహనంలో మహిళా పోలీసులు లేరనీ పేర్కొన్నారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ సహా పలు పార్టీల నేతలు పోలీసుల తీరును ఖండించారు. నేహాకు మద్దతు ప్రకటించారు. అనంతరం నరేలా పారిశ్రామిక ప్రాంతం పోలీసు స్టేషన్ నుంచి నేహా విడుదల కావడంతో పరిస్థితులు కొంత శాంతించాయి. ఆమె వద్ద ఫోన్, బ్యాగును పోలీసులు తీసేసుకున్నారని ఏఐఎస్ఏ ఆరోపించింది.

'పోలీసుల్ని కొరికారు'

ఘర్షణల సమయంలో తమ సిబ్బందిపై నిరసనకారులు దాడి చేశారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కొందరు పోలీసుల్ని వారు కొరికారనీ చెప్పారు. తాము నేహా బోరాను నిర్బంధించలేదని పోలీసులు చెప్పడం గమనార్హం. సీఈసీ రాజీనామా డిమాండుతో జంతర్ మంతర్‌వద్ద జరుగుతున్న నిరసన ప్రదర్శన వద్దకు శనివారం వెళ్లినప్పుడు తమపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఆరోపించడం కలకలం సృష్టించింది.

నన్ను ఫుట్‌బాల్‌లా విసిరేశారు: ఆప్ నేత సౌరభ్

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఇండియా గేట్ వద్ద ఆదివారం నిరసన చేపట్టిన పలువురు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆప్ దిల్లీ చీఫ్ సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యేలు సంజీవ్ ఝా, కుల్దీప్ కుమార్ తదితరులు ఉన్నారు. పోలీసులు తనను ఫుట్‌బాల్‌లా అటూఇటూ విసిరేశారని.. తలకిందులుగా ఎత్తడంతో ఊపిరాడనంత పనైందని సౌరభ్ ఆరోపించారు. పోలీసుల తీరును ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. ప్రధాని మోదీ హిట్లర్‌ను మించిపోయారని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ.. సీఈసీ రాజీనామా చేయాలని.. సంయుక్త నిరసన ప్రదర్శన చేపట్టను న్నాయి. జ్ఞానేశ్ రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ ముంబయిలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేల నేతృత్వంలో భారీ ర్యాలీ జరిగింది.

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయలేరు: భాజపా

సర్‌పై విపక్షాలు చేస్తున్నదంతా దుష్ప్రచారమని భాజపా ఆరోపించింది. సర్‌తో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు డిలీట్ ఏమీ కాలేదని పేర్కొంది. మృతులు, గైర్హాజరీ, నకలు వంటి కేటగిరీల్లో అవి చేరాయని తెలిపింది. వాటిపై క్లెయిములు, అభ్యంతరాలు, అప్పీళ్ల తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని గుర్తుచేసింది. విపక్షాలు వీధుల్లో అరాచకం సృష్టిస్తూ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని.. కానీ అది సాధ్యం కాదని పేర్కొంది.



జూరాలకు నీటి విడుదలలో అనిశ్చితి!

కర్ణాటక నుంచి వదలకుండానే నిలిపివేశారా అంటూ రైతుల్లో అనుమానాలు

ప్రస్తుతం జూరాలలో లైవ్ స్టోరేజీ 4.5 టీఎంసీలే..

మహబూబ్‌నగర్: కర్ణాటక నుంచి తెలంగాణకు కృష్ణా నీటి విడుదలలో అనిశ్చితి నెలకొంది. ఇరు రాష్ట్రాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఊగిసలాటల మధ్య జూరాల ఆయకట్టులో లక్ష ఎకరాల్లో ఖరీఫ్ సాగుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఉమ్మడి పాలమూరులోని జూరాల ఆయకట్టు రైతులు సాగు నీటి కోసం ఆందోళనలకు దిగిన క్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి బృందం గత నెల 22న కర్ణాటకలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణకు 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు అక్కడి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అర్ధాంతరంగా నీటి విడుదల ఆగిపోయింది. తెలంగాణకు సాగునీటిని విడుదల చేయడాన్ని కర్ణాటకలోని కృష్ణా బేసిన్ జిల్లాల్లోని రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచే గెజిట్ నోటిఫికేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తున్న అంశాన్ని అక్కడి పెద్దల దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. మానవతా దృక్పథంతో పరిమితంగా నీటిని విడుదల చేయడానికి ఆ రాష్ట్ర మంత్రి ఒకరు మద్దతు తెలపగా.. రైతు సంఘాల నేతలు సాగునీటికి సరఫరా చేస్తే ప్రతిఘటిస్తామని చెప్పినట్టు తెలిసింది. కర్ణాటకలో ప్రస్తుత పరిస్థితుల్లో జూరాలకు నీటి విడుదలపై మీమాంస కొనసాగుతుండగా.. జూరాల ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరులోని పలు రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. అధికారిక రికార్డుల్లో పేర్కొన్న గణాంకాలే వారి నాటకాలకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు. గత నెల 24 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు నారాయణపూర్ నుంచి జూరాలకు 27,600 క్యూసెక్కుల నీరు విడుదలైనట్టు రికార్డుల్లో చూపిస్తున్నారని వివరించారు. నారాయణపూర్ గేట్లు ఎత్తనేలేదని.. ఎగువన రెండు, మూడు రోజులు వర్షాలు కురవడంతో జూరాలకు వరద వచ్చిందని చెబుతున్నారు.

ఘటనపై దర్యాప్తు ముమ్మరం



దుబాయ్: ఫ్లై దుబాయ్ విమాన ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. పలుదేశాలు ఇందులో పాలుపంచుకుంటున్నాయి. యూఏఈ నేతృత్వంలోని దర్యాప్తు సంస్థలు నిందితుడైన కో--పైలట్ హమామీ ఉద్దేశాలు, ఇతరులతో అతడికి ఉన్న సంబంధాలపై దృష్టి పెట్టింది. ఒమన్‌కు చెందిన కో--పైలట్‌కు ఆస్ట్రేలియాతో ఉన్న సంబంధాలు, అతడు టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమాన సిబ్బందిలో ఎలా చేరాడనే దానిపై ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్ అధికారులు విచారణ జరుపుతున్నారు. నిందితుడికి ఆస్ట్రేలియాతో ఉన్న సంబంధాలపై ఉగ్రవాద నిరోధక బృందం దర్యాప్తు చేస్తోందని ఆస్ట్రేలియన్ ఫెడరల్ పోలీస్ విభాగం వెల్లడించింది. విమానంలోని కాక్‌పిట్‌లో కో--పైలట్ క్రాష్ గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి, విమానంపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నించాడని యూఏఈ అటార్నీ జనరల్ హమద్ సైఫ్ అల్ షంసీ పేర్కొన్నారు. కుట్ర కోణం త్వరలో బహిర్గతమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఫ్లై దుబాయ్ విమాన ఘటనకు ముందు యూఏఈ అధికారులు అందులోని ప్రయాణికులు, సిబ్బంది వివరాలను ఇజ్రాయెల్‌తో పంచుకున్నారని సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. తీవ్రవాద భావజాలం ఉన్న కో--పైలట్‌ను అతడి సొంత దేశమే విమానం నడపకుండా నిషేధించిందని ఇప్పటికే గుర్తించారు. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని ఒమన్ పౌరుడిని, ఇజ్రాయెల్ పౌరులతో నిండిన విమానాన్ని నడపడానికి ఎలా అనుమతించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆఖరి పోరాటం చేశా

(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రధాని మోదీతో కలిసి రావాలని సాదరంగా ఆహ్వానించారు. ఆరోజు ఏం జరిగిందనేది పైలట్ వివరించారు. "మా విధులు ఎప్పటిలాగే మొదలయ్యాయి. కోపైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పాడు. అది సాధారణంగా చాలామంది చేసేదే. అతను ప్రార్థన చేస్తుండగా దానిపై గౌరవంతో నేను వెనక్కి కాకుండా ముందుకే చూస్తున్నా. ఓ నాలుగైదు నిమిషాలు గడిచాయో లేదో.. నా తల వెనకవైపు గట్టిగా కొట్టినట్లు అనిపించింది. విమానానికి ఏదోఅయి నన్నేదో కొట్టిందని అనిపించింది. తర్వాత ఒకదాని తర్వాత ఒకటిగా పిడిగుద్దులు, అత్యవసర గొడ్డలితో దెబ్బలు. అప్పటికి గానీ నాకు బోధపడలేదు.. అది విమానంలో సమస్య కాదని, నాతోపాటు కాక్‌పిట్‌లో ఉన్నవాడే కొడుతున్నాడని! అతడిని ఆపడానికి ప్రయత్నించాను. దెబ్బల తీవ్రతకు నా దృష్టి మసకబారింది. విమానం అమాంతం కిందికి వెళ్లిపోతోంది. కచ్చితంగా ఏం జరిగిందో నాకు అంతగా గుర్తు రావడంలేదు. కాక్‌పిట్ తలుపులు తెరవాలని ప్రయత్నించాను. కోపైలట్ దాన్ని మూసేశాడు. అప్పటికే నేను కింద పడిపోయాను. విమానంలో పెద్దపెద్ద శబ్దాలు, ప్రయాణికుల ఆక్రందనలు వినిపిస్తున్నాయి. నాకు ఇక ఆఖరి పోరాట ప్రయత్నమే మిగిలింది. అది నాకోసమే అనండి.. ప్రజల కోసమే అనుకోండి. కానీ ఏదోఒకటి చేయకపోతే నాకు చావు తప్పదని అర్థమైంది. ఎలాగైనా తలుపు తెరవాలని బలంగా అనుకున్నాను. శక్తినంతా కూడదీసుకుని అది చేయగలిగాను. ఆ అవకాశం కోసమే బయట ఎదురుచూస్తున్నవారు అక్కడి నుంచి అందుకున్నారు" అని వివరించారు.

ఓటు హక్కు హరించడాన్ని సమర్థించలేం

(మొదటి పేజీ తరువాయి)

అని జస్టిస్ భూయాన్ స్పష్టం చేశారు. గతంలో కొన్ని తీర్పుల్లో ఓటు హక్కు ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ, 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు తీర్పు ప్రకారం ఓటు హక్కు కచ్చితంగా రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అది ఆర్టికల్ 326 ద్వారానే లభిస్తుందని జస్టిస్ భూయాన్ స్పష్టం చేశారు. పరిపాలనాపరమైన ప్రక్రియల ద్వారా పౌరుల ఓటు హక్కును హేతుబద్ధత లేకుండా హరించకూడదన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం--1950 ప్రకారం ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించే ముందు సదరు ఓటరుకు తగిన వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించాలన్నారు. 'ఓటరు మరణించిన సందర్భంలో తప్ప, ఒకసారి ఓటర్ల జాబితాలో చేరిన పేరును సదరు వ్యక్తికి నోటీసు ఇవ్వకుండా, వారి వివరణ వినకుండా తొలగించడానికి వీల్లేదు. ఒక భారతీయ పౌరుడి గుర్తింపు నుంచి ఓటు హక్కును లేదా ఓటర్ల జాబితాలో ఉండే హక్కును వేరు చేయలేం. అది శరీరం నుండి ఆత్మను తీసేయడంతో సమానం' అని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. జస్టిస్ భూయాన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్వాగతించారు. 'పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం గళమెత్తే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ఇప్పుడు ఓటు హక్కు అనేది రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో ఒక భాగమని అత్యంత ధైర్యంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా సీఈసీ స్వయంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ఇది నిరూపిస్తోంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. జస్టిస్ భుయాన్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వైఫల్యాలను పూర్తిగా ఎండగట్టారని, జ్ఞానేశ్‌కు ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఎంతమాత్రం లేదన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సైతం జస్టిస్ భూయాన్‌ను అభినందించారు. 'పదవీ విరమణ చేసిన రోజున న్యాయమూర్తులు ధైర్యంగా మాట్లాడటం చాలా సులువు.

జ్ఞానేశ్ రాజీనామా చేసి వెళ్లిపో

బీజేపీ చేతిలో నువ్వు ఓ ఆయుధం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్ ఠాక్రే సంయుక్తంగా ఆదివారం ముంబైలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'విరాట్ గర్జన మోర్చా' పేరుతో జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్‌తోపాటు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్పీ) నేతలు కూడా పాల్గొని మద్దతు పలికారు. బైకులాలోని రిచర్డ్‌సన్ అండ్ క్రుడ్డాస్ నుంచి ఆదివారం ఉదయం మొదలైన ఈ ర్యాలీ దక్షిణ ముంబైలోని బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగింది. పార్టీ జెండాలను పక్కన పెట్టి.. జాతీయ పతాకాన్ని చేబూని ఈ ర్యాలీ నిర్వహించడం గమనార్హం. ఈసీఐ ఒక్కటే తమ అజెండా అని, బీజేపీ సైతం ర్యాలీలో పాల్గొనవచ్చని రాజ్‌ఠాక్రే ప్రకటించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, మహారాష్ట్రలో నిర్వహించిన సర్‌ను రద్దు చేయాలని ఠాక్రే సోదరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ చేతిలో ఆయుధంలా, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా సర్ చేపట్టినట్లయితే ఎంత మంది అక్రమ వలసదారులను గుర్తించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో సర్ తర్వాత సుమారు 2 కోట్ల మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో కనిపించకపోవడాన్ని ప్రస్తావించారు.

అభివృద్ధినే ఆదరిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుఇవఎఙఅజవ దీథుఅఙ్త్ర కాంగ్రెస్ ప్రభు త్వం మైనారిటీల సంక్షేమానికి ఏటా రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామన్న హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీల సంక్షేమానికి రూ.1,800 కోట్ల వరకు ఖర్చు చేశామని తెలిపారు. మైనారిటీ గురుకులాలు, విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ ఉద్యోగుల జీతాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, కల్యాణలక్ష్మి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేయకుండా మల్లన్నసాగర్‌లో మిగిలిన పనులు పూర్తి చేసి, కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తి ప్రాజెక్టుకు నీరందించాలని కోరారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు మరువరని, ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

17 వేల అడుగుల పతనం, 174 మంది ప్రాణాలు కాపాడిన భారత కెప్టెన్

- ఫ్లై దుబాయ్ విమానంలో కో-పైలట్ ఉన్మాద దాడి
- తీవ్రంగా గాయపడినా కాక్‌పిట్ తలుపు తెరిచిన కెప్టెన్ స్మిత్ మచ్చార్
- ప్రయాణికులు, ఇద్దరు ఆఫ్‌డ్యూటీ పైలట్ల సాహసం సౌదీలో అత్యవసర ల్యాండింగ్

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్) అక్టోబర్ 04

ఆకాశంలో వేల అడుగుల ఎత్తులో విమానం... కాక్‌పిట్‌లో రక్తపాతం... నియంత్రణ కోల్పోతున్న భారీ ప్రయాణికుల విమానం... క్షణక్షణానికి మరణం చేరువవుతున్న వేళ ఒక భారతీయ పైలట్ ప్రదర్శించిన అసాధారణ ధైర్యం, ప్రయాణికుల సమయస్ఫూర్తి, మరో ఇద్దరు పైలట్ల నైపుణ్యం కలిసి 174 మంది ప్రాణాలను కాపాడిన అపూర్వ ఘటనగా ఫ్లై దుబాయ్ ఎఫ్ జెడ్ 1073 విమాన ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

అసలు ఏం జరిగింది?

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ ఎఫ్ జెడ్ 1073 విమానంలో సుమారు 174 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం 34,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో కో-పైలట్ కెప్టెన్‌పై దాడికి దిగినట్లు అధికారులు తెలిపారు. యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ తాజా ప్రకటన ప్రకారం, కో-పైలట్ కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తో కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి విమాన నియంత్రణను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించాడు. యూఏఈ అధికారులు ఈ ఘటనను "టెర్రరిస్ట్ యాక్ట్"గా అభివర్ణించారు. అయితే పూర్తి దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. విమానం ఒక్కసారిగా భారీగా కిందకు పడిపోయింది. ఫ్లైట్-ట్రాకింగ్ డేటా ప్రకారం 30 సెకన్లలోనే 16,000 అడుగులకు పైగా ఎత్తు కోల్పోయింది. ఒక దశలో 34,000 అడుగుల నుంచి సుమారు 16,600 అడుగులకు పడిపోయినట్లు నమోదైంది

రక్తమోడుతున్నా... చివరి శక్తితో తలుపు తెరిచిన కెప్టెన్

భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ విమానం కిందకు దూసుకుపోతున్న విషయం గ్రహించి, తనను తాను నిలబెట్టుకుని కాక్‌పిట్ తలుపు తెరిచారు.

"నేను నా ప్రాణం కోసం పోరాడుతున్నాను... కానీ విమానం కిందకు వెళ్తున్నప్పుడు నేను లేవకపోతే ప్రయాణికులు చనిపోతారని అర్థమైంది" అని ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన వీడియో కాల్‌లో వివరించారు. తలకు, చేతులకు తదితర ప్రాంతాల్లో గాయాలతో రక్తమోడుతున్నప్పటికీ ఆయన తీసుకున్న ఆ ఒక్క నిర్ణయం విమానంలోని మిగిలిన వారిని కాక్‌పిట్‌లోకి ప్రవేశించే అవకాశం కల్పించింది.

ప్రయాణికులే హీరోలు!

కాక్‌పిట్ తలుపు తెరుచుకున్న వెంటనే కొంతమంది ప్రయాణికులు లోపలికి దూసుకెళ్లారు. కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కొందరు ప్రయాణికులు అతడిని కట్టేసేందుకు ప్రయత్నించారు. ఒక ప్రయాణికుడు విమానం నియంత్రణను స్థిరపరిచేందుకు సహకరించినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనాలు చెబుతున్నాయి.

యానివ్ హయూన్ అనే ప్రయాణికుడు, వృత్తిరీత్యా ప్లంబర్, కాక్‌పిట్‌లోకి చేరి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సహకరించిన వారిలో ఒకరిగా గుర్తించబడ్డారు. మరో ప్రయాణికుడైన దంత వైద్యుడు కూడా గాయపడిన కెప్టెన్‌కు వైద్య సహాయం అందించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

విమానంలోనే ఉన్న మరో ఇద్దరు పైలట్లు ఈ ఘటనలో మరో కీలక అంశం

విమానంలో ప్రయాణికులుగా ఉన్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ ఫ్లై దుబాయ్ పైలట్లు.వారిని విమానయాన రంగంలో " డెడ్ హెడింగ్ క్రూ "గా పిలుస్తారు. తదుపరి డ్యూటీ కోసం ఒక విమానంలో ప్రయాణికులుగా పంపించడం విమానయాన సంస్థల్లో సాధారణ ప్రక్రియ. ఈ ఇద్దరు పైలట్లు సంక్షోభ సమయంలో కాక్‌పిట్‌లోకి చేరి విమాన నియంత్రణ చేపట్టారు. చివరకు విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయానికి సురక్షితంగా దించారు.

సౌదీలో అత్యవసర ల్యాండింగ్

విమానంలో పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత విమానం టెల్ అవీవ్‌కు వెళ్లకుండా దారి మళ్లి సౌదీ





అరేబియాలోని టబుక్ విమానాశ్రయంలో అత్యవసరంగా దిగింది. ప్రయాణికులలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, కెప్టెన్ మచ్చార్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. కో-పైలట్ కూడా గాయపడ్డాడు.

కెప్టెన్ స్మిత్ మచ్చార్ ఇప్పుడు ఎక్కడ?

తొలుత టబుక్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందిన కెప్టెన్ మచ్చార్‌ను అనంతరం అబుదాబిలోని ఆసుపత్రికి తరలించారు. అక్టోబర్ 3న భారత రాయబార కార్యాలయం ఆయన కోలుకుంటున్నారని, మంచి వైద్యం అందుతోందని వెల్లడించింది. కుటుంబ సభ్యులు కూడా ఆయనతో ఉన్నారు. అక్టోబర్ 2న ఆయన ఆసుపత్రి బెడ్ నుంచే ప్రధాని మోదీతో వీడియో కాల్‌లో మాట్లాడారు. తలకు బ్యాండేజ్, ముక్కుకు ఆక్సిజన్ ట్యూబ్‌తో కనిపించినప్పటికీ, మోదీ అడిగినప్పుడు తన ఆరోగ్యం గురించి "ఆల్ గుడ్" అని చెప్పడం ఆయన ఆత్మవిశ్వాసాన్ని చాటింది.

మోదీ భావోద్వేగ స్పందన

ప్రధాని నరేంద్ర మోదీ కెప్టెన్ మచ్చార్‌తో వీడియో కాల్‌లో మాట్లాడి ఆయన ధైర్యాన్ని అభినందించారు. "మీ ధైర్యం, సహనం, సమయస్ఫూర్తి దేశానికి గర్వకారణం" అన్న భావంతో మోదీ ప్రశంసించారు. 140 కోట్ల మంది భారతీయులు ఆయన ధైర్యాన్ని చూసి గర్విస్తున్నారని తెలిపారు. కెప్టెన్ తల్లిదండ్రులు భూపెన్, గీత, భార్య సోనంతో మోదీ మాట్లాడినట్లు సమాచారం

నేతన్యాహు అభినందనలు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహు కూడా కెప్టెన్ మచ్చార్‌ను "హీరో"గా అభివర్ణించారు. ఇజ్రాయెల్, భారత్, ప్రపంచం మొత్తం ఆయన ధైర్యాన్ని గుర్తిస్తున్నాయని ప్రశంసించారు. నేతన్యాహు మచ్చార్‌ను, మోదీని ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆహ్వానించినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.

ట్రంప్ స్పందన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కెప్టెన్ మచ్చార్‌ను హీరోగా అభివర్ణించారు. తీవ్ర గాయాలున్నప్పటికీ భారీ ప్రమాదాన్ని నివారించడంలో ఆయన చూపిన సమయస్ఫూర్తిని ప్రశంసించారు.

కో-పైలట్ ఎవరు?

దర్యాప్తులో కో-పైలట్‌గా హమామ్ అల్-హమ్మామి అనే (29)ఏళ్ల ఒమానీ పౌరుడని పలు విశ్వసనీయ అంతర్జాతీయ మీడియా సంస్థలు గుర్తించాయి. యూఏఈ అధికారులు మాత్రం తమ ప్రకటనలో పేరు వెల్లడించకుండా "కో-పైలట్"గా పేర్కొన్నారు. అల్-హమ్మామి యూఏఈలో ఒమానీ తండ్రి, సిరియా తల్లికి జన్మించినట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్రిటన్‌లోని బకింగ్ హామ్ షైర్ న్యూ యూనివర్సిటీ లో దూరవిద్య ద్వారా అవియేషన్ మానేజ్ మెంట్ చదివి 2023లో పూర్తి చేసినట్లు యూనివర్సిటీ ధృవీకరించింది. అతని కెరీర్‌లో ఒమాన్ ఎయిర్ ? రాయల్ ఎయిర్, ఎయిర్ మోరాకో ? ఫ్లైదుబాయ్ ఉన్నట్లు దర్యాప్తు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒమాన్ ఎయిర్ లో పనిచేసిన సమయంలో తీవ్రవాద భావజాలానికి సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో అతడిని ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తొలగించారని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఈ వివరాలపై అధికారిక దర్యాప్తు పూర్తికావాల్సి ఉంది.

దాడికి అసలు కారణం ఏమిటి?

ఇదే ఇప్పుడు దర్యాప్తులో అత్యంత కీలక ప్రశ్న.

యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ అక్టోబర్ 3న ఈ ఘటనను "టెర్రరిస్ట్ యాక్ట్"గా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహు కో-పైలట్ ఇస్లామిస్ట్ రాడికల్ భావజాలానికి లోనయ్యాడని, విమానాన్ని కూల్చే ఉద్దేశంతో వ్యవహరించాడనే అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఎవరైనా అతడిని ప్రేరేపించారా? మరెవరైనా వెనుక ఉన్నారా? లేక అతడు ఒంటరిగానే వ్యవహరించాడా? అన్నది ఇంకా పూర్తిగా తేలలేదు. ఇజ్రాయెల్, యూఏఈ, సౌదీ అరేబియా తదితర సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి.ఈ ఘటనలో బోయింగ్ 737 మాక్స్ 8 విమానం భారీ పతనాలు, తీవ్ర కుదుపులకు గురైంది. విమానం సురక్షితంగా టబుక్‌లో దిగినప్పటికీ, రడ్డర్‌కు నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాడి సమయంలో విమానం తీవ్రంగా దెబ్బతినడంతో సాధారణ ప్రయాణానికి వెంటనే ఉపయోగించే పరిస్థితిలో లేదని సమాచారం. ఈ ఘటనలో విమానాన్ని కాపాడిన నాలుగు కీలక అంశాలు. గాయపడినా కెప్టెన్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరవడం. ప్రయాణికులు వెంటనే కాక్‌పిట్‌లోకి ప్రవేశించి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం. విమానంలోనే ఉన్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు నియంత్రణ చేపట్టడం. అత్యవసర పరిస్థితిలో సౌదీ అధికారులు టబుక్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు సహకరించడం వల్ల భారీ ప్రాణ నష్టం, ప్రమాదశే తప్పింది.

ఆకాశంలో ఆ 30 సెకన్లు చరిత్రలో నిలిచిపోయే క్షణాలు

ఒక విమానం వేల అడుగుల ఎత్తు నుంచి కిందకు దూసుకుపోతున్నప్పుడు, కాక్‌పిట్‌లో పైలట్ తీవ్రంగా గాయపడిన పరిస్థితిలో, సాధారణ ప్రయాణికులు ముందుకు వచ్చి విమానాన్ని కాపాడటం అరుదైన సంఘటన.కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్యం, ప్రయాణికుల తెగువ, ఆ ఇద్దరు పైలట్ల వృత్తి నైపుణ్యం కలిసే ఫ్లై దుబాయ్ ఎఫ్ జెడ్ 1073 విమానాన్ని విపత్తు నుంచి బయటపడేశాయి.

ఇది కేవలం విమాన ప్రమాదం తప్పిన కథ కాదు. ప్రాణాపాయంలో మనిషి చూపగల ధైర్యానికి, బాధ్యతకు, సమయస్ఫూర్తికి ప్రపంచం గుర్తుంచుకునే మంచి ఉదాహరణ.



కరీంనగర్‌లో నేడు రెడ్‌క్రాస్ ఎన్నికల పోలింగ్

- 15 నిర్వహణ కమిటీ స్థానాలకు 17 మంది అభ్యర్థులు.. 17,886 మంది ఓటర్లు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 04

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ పాలకమండలి ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. మొత్తం 15 మేనేజింగ్ కమిటీ స్థానాలకు 17 మంది అభ్యర్థులు తుది బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,886 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ పాలకమండలి ఎన్నికల్లో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకుని అభ్యర్థుల ఎంపికలో భాగస్వాములు కానున్నారు. పోలింగ్ అనంతరం ఎన్నికల ప్రక్రియలో తదుపరి దశలు కొనసాగనున్నాయి.



గురువులను పూజించండి.. ధర్మాన్ని కాపాడండి

కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజాతీర్పు)

గురువులను, ఆచార్యులను పూజిస్తూ ధర్మాన్ని కాపాడాలని శ్రీవిల్లిపుత్తూరు మానవాళి సన్నిధి ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామి సూచించారు. శ్రీమన్నారాయణ శఠగోప సిద్ధాంత పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆచార్య యాత్రలో భాగంగా ఆదివారం కోరుట్ల పట్టణంలోని ప్రాచీన వేణుగోపాల స్వామి దేవాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా భక్తులకు ఆచార్యుల విశిష్టత, గురువుల పట్ల చూపాల్సిన గౌరవం, ధర్మ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి మేలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సేనాపతి ఆచార్య ప్రవీణ్ కుమార్, బీర్నంది నరసింహాచార్యులు, వామనాచారి కృష్ణచంద్ర, కలకుంట్ల నరసింహమూర్తి, కలకుంట్ల రాధాకృష్ణ, నితిన్, రాకేష్, విష్ణు తదితరులతో పాటు వేణుగోపాల స్వామి భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.



చిల్లర్గి శివారులో చిరుత కలకలం.. గేదె దూడ మృతి

పిట్లం, అక్టోబర్ 04 (ప్రజా తీర్పు)

పిట్లం మండలం చిల్లర్గి గ్రామ శివారులో శనివారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు పాశం సుధాకర్‌కు చెందిన గేదె దూడల పై చిరుత దాడి చేయడంతో దూడలు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనతో గ్రామస్థులు, రైతులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న చిల్లర్గి అటవీ బీట్ అధికారి (ఎఫ్‌బీఓ) ప్రభు ప్రసన్నకుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన గేదె దూడల ను పరిశీలించి పంచనామా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ హైమద్ కూడా అక్కడికి చేరుకుని దూడ మృతికి గల కారణాలను పరిశీలించారు. చిరుత సంచారం నేపథ్యంలో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని తెలిపారు. చిరుత కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.



సింగీతం శ్రీనివాస్ రావు సేవలు అజరామరం...

– కళాశ్రీ అధినేత గుండేటి రాజు.

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 4.

ప్రముఖ సినీ దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాస్ రావు జాతీయ చలన చిత్ర పరిశ్రమలో పలు భాష చిత్రాలలో దర్శకుడిగా తన ప్రతిభ పాటవాలతో ప్రేక్షకులను అలరించిన మహోన్నత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు అని వారి మరణం జాతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటని కళాశ్రీ అధినేత గుండేటి రాజు అన్నారు. ఆదివారం స్థానిక జగిత్యాల దేవిశ్రీ గార్డెన్స్ లో జగిత్యాల షార్ట్ ఫిలిం ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశంలో సినీ దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాలర్పించి రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ సందర్భంగా యూ ట్యూబ్ దర్శకుడు గడ్డం రాజ రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో యూ ట్యూబ్ షార్ట్ ఫిలిమ్స్ తో జగిత్యాల షార్ట్ ఫిలిం హబ్ గా రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దాదాపు యూ ట్యూబ్ రంగంలో వివిధ హోదాలో పనిచేస్తున్న 150 మంది కళా కారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాజ రామ్ మోహన్ రెడ్డి, సకినాల నరేందర్, డి. సి . శేఖర్, నరేందర్ రావు, మ్యాన కైలాస పతి, బొమ్మనేని సిరి, తోట హన్మంత్, స్వామి గౌడ్, బోగ రామ్ , గెటప్ శ్రీనివాస్ చారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు రిజర్వేషన్ లు కల్పించిన మహానీయుడు డా. బి ఆర్.అంబేడ్కర్

- ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు రామడుగు రాజేష్
- దళిత సంఘ సీనియర్ నాయకుడు పడిదం వెంకటేష్ ఆధ్వర్యంలో రాజారాం పల్లిలో అంబేడ్కర్ సంస్మరణ దిన వేడుకలు

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్ 04 :

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి వివేకానంద చౌరస్తాలో డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ ను స్మరించుకుంటూ ప్రతి నెల మొదటి ఆదివారం రోజున డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ సంస్మరణ దిన వేడుకలు దళిత సంఘం సీనియర్ నాయకులు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు పడిదం,వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం లో స్వేచ్ఛ, సమానత్వం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే యోగ్యత తనకు లభించిందని పడిదం వెంకటేష్ పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, ప్రముఖ న్యాయవాది, ధర్మపురి కోర్టు బార్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత , పేద బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి, దేశం లో రిజర్వేషన్ ల అమలుకు ఆజ్యం పోసి , మహిళ ల కు ఓటు హక్కు కల్పించి, హిందూ కోడ్ బిల్లు ప్రవేశ పెట్టించిన మహనీయుడు డా. బి.ఆర్ అంబేడ్కర్ అని, ఆయన సేవలను స్మరించుకుంటూ, ప్రతి నెల ఆయన సంస్మరణ దిన వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు పడిదం వెంకటేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కోడి గంగయ్య(చంటి), ఆరెల్లి బాబు రాజు,డా. రాజేష్, భారత రాజు, నిమ్మ నాగమల్లు, బీసీ నాయకులు ఉప్పు రాజయ్య, ఎండి. సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోత ఆందోళనలో అన్నదాత

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఎల్లారెడ్డిపేట, ప్రజా తీర్పు)

అక్టోబర్ 4

ఎల్లారెడ్డిపేట మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో పొట్ట దశలో ఉన్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల వద్ద గల వేశాయ ట్రాన్స్ఫార్మర్ల పై తరచూ ఫీజు వైర్లు కొట్టివేయడం వల్ల విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది గంటలకొద్దీ విద్యుత్తులో కోత విధించడం వల్ల పంటలు పూర్తిస్థాయిలో పండుతాయి లేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొంటుండగా మరోపక్క విద్యుత్ కోత విధించడం వల్ల అసలు పంట చేతికి వస్తుందో లేదోనని రైతాంగం ఆందోళన చెందుతున్నారు అంతేకాకుండా ప్రతిరోజు వ్యవసాయ పొలాల వద్ద ఐదు గంటల వరకు ఉండవలసిన విద్యుత్తు సాయంత్రం నాలుగు గంటల వరకే తీసివేస్తున్నారని ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా లేదా ప్రకృతి పరంగానే జరుగుతుందా అనే అనుమానాలు రైతులు లేవనెత్తుతున్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ పొలాల వద్ద రోజుకి మూడు లేదా నాలుగు గంటలు మాత్రమే విద్యుత్ కోత ఉండేదని కానీ ప్రస్తుతం విద్యుత్ కోతలతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు తెలుగు ప్రభ తో పేర్కొన్నారు. రైతులు ఎన్పీడీసీఎల్ అధికారులకు ఫోన్ చేసి చెబితే అప్పుడు వారు ట్రాన్స్ఫార్మర్లపై ఫీజు వైర్లు వేస్తున్నారని ఇది ఎన్పీడీసీఎల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు రాత్రిపూట వేసే పొలాల వద్ద కరెంటు లేకపోవడంతో పంట పొలాల్లో బీటలు వారాయని బోరు మోటర్లలో బావులలో నీరు ఉన్నప్పటికీ ఉండి లేని సంబంధం గా మారిందని రైతులు పేర్కొంటున్నారు గతంలో సెస్ గా ఉన్నప్పుడు విద్యుత్తు సరఫరా సక్రమంగా జరిగేదని కానీ ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ లో కలిసినప్పటికీ తాము ఆనందంగా లేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఎండిపోయిన పంటలపై ఎన్పీడీసీఎల్ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరానా 50 వేల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.

యల్ల పాళ్ల లేకుండా కరెంటు ఇస్తున్నారు



నా వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు నాటు వేసే సమయంలో మూడు మీటర్ల వరకు దూరంలో బోరు నీటిని పోసేది. ఇప్పుడు అర్ధ మీటర్ దూరంలో కూడా నీరు పోయడం లేదు. కరెంటు కూడా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తున్నారు. పొలం ఎండిపోయే పరిస్థితి ఉంది.

పెద్దవేని రాజు అల్మాస్ పూర్, రైతు

వరుస తడుల ద్వారా పంటలు పండిస్తున్నాం!




కరెంటు సరిగా రాకపోవడంతో వచ్చిన కొద్ది కరెంటు ద్వారా నాకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలం వరుస తడుల ద్వారా పండిస్తున్నాం. పోయిన వరి పంటల సమయంలో మంచిగా కరెంట్ ఇచ్చినారు. ఇప్పుడు సరిగా కరెంట్ ఎందుకు ఇస్తలేరో అర్థం కావడం లేదు.

అజ్మీర తిరుమల, బుగ్గ రాజేశ్వర్ తండా

డిస్కం ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా జరుగుతుంది.

ఎన్ పిడీసీఎల్ , ఏఈ రాకేష్ రెడ్డి.

ఎల్లారెడ్డిపేట మండలంలో వ్యవసాయ బావులకు సంబంధించిన 700 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు ఉన్నాయి. డిస్కం ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుంది. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు ఉంటే నేరుగా నాకు పిర్యాదు చేయాలి.



మైనంపల్లి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి మరియు 500 మంది అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరిక

(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి మేడ్చల్) అక్టోబర్ 04

నేరెడ్‌మెట్‌లోని మహాబోధి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు సమక్షంలో వీరంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైనంపల్లి హనుమంత్ రావు వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్య విశేషాలు: ?చేరిన వర్గాలు: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 500 మంది నాయకులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీ సభ్యులు మరియు యువత. ?నేరెడ్‌మెట్ రజక సంఘం (అధ్యక్షుడు కృష్ణ) ?నేరెడ్‌మెట్ ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ (అధ్యక్షుడు రాజేందర్) ?వివేకానందపురం, ఆర్‌కే పురం, సీబీఎన్ కాలనీ యువత మరియు ప్రతినిధులు.

?పాల్గొన్న ముఖ్య నాయకులు: అబ్జర్వర్ సమీర్ కౌశల్ ?మాజీ కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్ర నాథ్ ?సీనియర్ నాయకులు ఎస్.ఆర్. ప్రసాద్, ఇంచార్జ్ లక్ష్మీ కాంత్ రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ?డివిజన్ అధ్యక్షుడు రాఘవన్, బి.కే. శ్రీనివాస్, గుండా నిరంజన్, జి.ఎన్.వి. సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఏ.కే. మురుగేష్ తదితరులు.

సంతోషిమాత దేవాలయ సంఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- బిజెపి జగిత్యాల జిల్లా నాయకులు మామిడిపల్లి ప్రసాద్

ప్రజాతీర్పు, ఎండపల్లి, అక్టోబర్ 04:



హైదరాబాద్ దిల్ షుక్ నగర్ సంతోషిమాత దేవాలయంలో ఆలయ పూజారి పూజలు చేస్తుండగా ఎండి. అన్సారి అకస్మాత్తుగా ఆలయ పూజారిపై అల్లాహు అక్బర్ అంటూ నినదిస్తూ దాడి చేయడమే కాకుండా, ఆలయంలో దేవి మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యనని జగిత్యాల జిల్లా బిజెపి నాయకులు మామిడిపల్లి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో కొంతమంది మతోన్మాద శక్తులు హిందూ దేవాలయాలపై దాడి చేయడం పరిపాటిగా మారిందని, అలాంటివారు మతిస్థిమితం లేకుండా దాడులు చేశారని, నిందితులకు శిక్ష పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే కాపాడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మతోన్మాద శక్తులను ప్రోత్సహించకుండా సబ్బండ వర్గాల మతాలను సమ్మేలితం చేసే విధంగా నిందితుని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి వరంగల్ కె. మనోహర్
- నర్సంపేటలో 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు

నర్సంపేట రూరల్, అక్టోబర్04, ప్రజా తీర్పు ప్రతినిధి:

తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ముద్రలు వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సందర్భంగా తూకాలను పరిశీలించాలని సూచించారు.

బీరు సీసాతో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

చిగురుమామిడి, అక్టోబర్0 4 రవీందర్ ప్రజా తీర్పు



చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో శనివారం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాసరి సాగర్‌రెడ్డికి తలకు తీవ్ర గాయమై, రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రేకొండ గ్రామానికి చెందిన పంకెర్ల రాజు, దాసరి సాగర్‌రెడ్డి మధ్య జరిగిన ఘర్షణలో రాజు బీరు సీసాతో సాగర్‌రెడ్డిపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సాగర్‌రెడ్డి తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. గాయపడిన సాగర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంకెర్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. ఘటనకు దారితీసిన కారణాలు, ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

హెచ్ఎండిఏ లేఔట్ బాధలు భగ్గుమన్నాయి - రోడ్డెక్కిన కుటుంబాలు

- వసతుల్లేక నాలుగేళ్లు... జాతీయ రహదారిపై నిరసన జ్వాలలు.
- కరెంటు లేదు, రోడ్డు లేదు... హెచ్ఎండిఏ నిర్లక్ష్యంపై ప్లాట్ల యజమానుల ఆగ్రహం.
- మేడిపల్లిలో లేఔట్ సమస్యలు -- సీఎం స్పందించాలని రోడ్డెక్కిన ప్రజలు.
- హెచ్ఎండిఏపై గర్జించిన కొనుగోలుదారులు -- అమీర్‌పేట్ కార్యాలయం ముట్టడికి హెచ్చరిక.

మేడిపల్లి, అక్టోబర్ 4 ప్రజాతీర్పు:

మేడిపల్లి పరిధిలోని హెచ్ఎండిఏ లేఔట్‌లో ప్రాథమిక వసతులు కల్పించకపోవడంపై ప్లాట్ల యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. నాలుగేళ్లుగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కుటుంబాలతో కలిసి నిరసనకు దిగిన వారు, హైదరాబాద్--వరంగల్ జాతీయ రహదారిపై ప్లకార్డులతో భారీగా ఆందోళన నిర్వహించారు.



ఆదివారం హెచ్ఎండిఏ లేఔట్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమైన ప్లాట్ల కొనుగోలుదారులు, అనంతరం ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి", "హెచ్ఎండిఏ నిర్లక్ష్యానికి ముగింపు కావాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ---

లేఔట్‌లో ఇప్పటికీ కరెంటు సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం ఎలా ప్రారంభించాలనే సందిగ్ధంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఆర్ఐ -- పర్వతపూర్ మధ్య 60 ఫీట్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడం, పార్కుల చుట్టూ కాంపౌండ్ వాల్, గేట్ల ఏర్పాటు, గ్రీనరీ అభివృద్ధి పనులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, తాగునీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండిఏ అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే అక్టోబర్ 6న అమీర్‌పేట్‌లోని హెచ్ఎండిఏ ప్రధాన కార్యాలయాన్ని కుటుంబాలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, కార్యదర్శి ఈదునూరి హేమంత్ కుమార్, సతీష్, సురేష్ నాయక్, రమణారెడ్డి, డీఎస్ నాయక్, అశోక్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లాలో 79 శాతం రైతు నమోదు పూర్తి

- 2.20 లక్షల మంది రైతుల్లో 1.74 లక్షల మందికి ఆన్‌లైన్ నమోదు.. మిగిలిన రైతులు త్వరగా నమోదు చేసుకోవాలి

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 04

జిల్లాలో రైతుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 79 శాతం మంది రైతుల నమోదు ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చిత్రు నాయక్ తెలిపారు. జిల్లాలో మొత్తం 2,20,096 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 1,74,393 మంది రైతులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. గ్రామాల వారీగా రైతుల నమోదు ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు నమోదు పూర్తయిన అనంతరం సంబంధిత రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడీ) జారీ అవుతుందని, ఈ గుర్తింపు సంఖ్య భవిష్యత్‌లో రైతుకు సంబంధించిన వివిధ వ్యవసాయ సేవలు, ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు తమ గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి అర్హత కలిగిన రైతు వివరాలు నమోదు అయ్యేలా గ్రామస్థాయిలో ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్‌లో ప్రభుత్వ వ్యవసాయ సేవలు, పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన రైతు గుర్తింపును పొందాలని అధికారులు సూచించారు.



ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు

- రెడ్‌క్రాస్ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్న 53 మంది ట్రాన్స్‌జెండర్లు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 04

కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో జరుగుతున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మొత్తం 15 డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా 53 మంది ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా నిలుస్తూ తమ ఓటును వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో ఆపదలో ఉన్నవారికి, అవసరాల్లో ఉన్న ప్రజలకు సేవలు అందించే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వంటి సేవా సంస్థ ఎన్నికల్లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సంస్థ భవిష్యత్ కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం కల్పిస్తున్నామనే భావన కలుగుతోందని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుండగా, వివిధ వర్గాలకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివచ్చారు. ఎన్నికల సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేపట్టి పోలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన రెడ్‌క్రాస్ సంస్థలో తమ భాగస్వామ్యాన్ని ఓటు ద్వారా చాటుకోవడం ఆనందంగా ఉందని ట్రాన్స్‌జెండర్లు పేర్కొన్నారు.



జ్యోతి నగర్ కాలనీలో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా కె శ్రీనివాస్ రావు, కార్యదర్శిగా బండి మల్లేష్ ఎంపిక.
- కాలనీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తాం -- నూతన కమిటీ హామీ.
- జ్యోతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కొత్త నాయకత్వం.

మేడిపల్లి, అక్టోబర్ 4 (ప్రజాతీర్పు):

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని జ్యోతి నగర్ కాలనీ సంక్షేమ సంఘానికి నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కె శ్రీనివాస్ రావు, కార్యదర్శిగా బండి మల్లేష్ సభ్యుల సమ్మతితో బాధ్యతలు చేపట్టారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో కోశాధికారిగా హరికృష్ణ యాదవ్, కార్యనిర్వహక అధ్యక్షుడిగా పెంచికల బాలరాజును కూడా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కె శ్రీనివాస్ రావు, కార్యదర్శి బండి మల్లేష్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పారదర్శకంగా పనిచేస్తామని తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకొని పోతూ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం ముఖ్యులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో శ్వేత విప్లవం మొదలైంది రైతుల అదనపు ఆదాయం రాష్ట్రానికి గుండెకాయ లాంటి అముల్ డైరీ ప్రాజెక్టు ప్రారంభోత్సవం

- రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్..18 నెలల్లో నిర్మాణం పూర్తి
- రైతులకు అదనపు ఆదాయం..
- మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) అక్టోబర్ 4



సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు.

రైతు ఉత్పత్తులకు విలువ జోడింపే లక్ష్యం

రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతోపాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు.

సహకారంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట

రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని కిషన్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అవి నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులే సహకార వ్యవస్థలో భాగస్వాములైతే దళారుల దోపిడీ, అవినీతి, రాజకీయ నాయకుల పెత్తనం తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సహకార సంఘాల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల్లోనే వినియోగమై స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని వివరించారు. సహకార ఉద్యమం కేవలం వ్యాపార నమూనా కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ సహకార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

అమూల్ విజయమే రైతుల విజయం

సహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1964లో 19 సహకార సంఘాలతో రోజుకు 5,100 లీటర్ల పాల సేకరణతో ప్రారంభమైన సాబర్ డెయిరీ నేడు రోజుకు సుమారు 50 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ స్థాయికి చేరిందన్నారు. సుమారు 50 వేల మంది పాల ఉత్పత్తిదారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, 2025-26లో రూ.10,500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిందని తెలిపారు. అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళ్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అమూల్ సాధిస్తున్న గుర్తింపు భారత రైతుల విజయానికి నిదర్శనమన్నారు.

2029 నాటికి 75 వేల కొత్త సంఘాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకార శాఖను ఏర్పాటు చేసి సహకార రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారని కిషన్‌రెడ్డి అన్నారు. శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75 వేల కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ 1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

మహిళా సంఘాలు, పాడి రైతులు సహకార సంఘాలుగా ఏర్పడి పశుపోషణను విస్తరించాలని సూచించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా లభించే రూ.20 లక్షల వరకు రుణాలను సద్వినియోగం చేసుకొని పశువులను కొనుగోలు చేయడం, పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు.

రైతు బలపడితే దేశం బలపడుతుంది

ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని, ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు వాటా భారత్‌దేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హరిత విప్లవం వ్యవసాయ రంగానికి, నీలి విప్లవం మత్స్య రంగానికి కొత్త శక్తినిచ్చినట్లే శ్వేత విప్లవం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో సహకార రంగం కీలక స్తంభంగా నిలవాలన్నదే లక్ష్యమని తెలిపారు.

శ్వేత విప్లవం 2.0 ద్వారా రైతులకు అదనపు ఆదాయం, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన, గ్రామాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పాడి రైతులు సహకార ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్రాన్ని శ్వేత విప్లవంలో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. రైతు బలపడితే గ్రామం బలపడుతుంది.. గ్రామం బలపడితే తెలంగాణ, దేశం బలపడతాయి అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ వల్ల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నాణ్యమైన పాలు పాఠశాల విద్యార్థులకు అందచేయవచ్చని , రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి నాణ్యమైన పాలు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తున్న వివరించారు . మెట్రో కార్యక్రమాల్లో కేంద్రం నుంచి శాఖ సహాయ సహకారాలు అందించాలని మంత్రి కిషన్ రెడ్డి నీ కోరారు. అమూల్ ప్లాంటును చెన్నూరులో ఏర్పాటు చేయాలని , చెన్నూరు పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలో కూడా మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. ఐటి శాఖామంత్రి దుద్దెల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల వెన్నెముక పాల డైరీ అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. అమూల్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు గ్రామీణ రైతుల ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ...విభిన్న సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం మెదక్ జిల్లా అన్నారు.ఇటీవల వాతావరణ పరిస్థితులు మారుతున్న కాలానికి అనుగుణంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతన్నలకు కష్టం కావద్దని నేను పుట్టిన ఈ గడ్డలో రైతన్నలకు గల్లి నుంచి ఢిల్లీ దాకా రైతులకు ఏదో చేయాలని దృఢ సంకల్పంతో ఢిల్లీలో అమూల్ ప్రతినిధులను సంప్రదించామని తెలిపారు.

ఎవరు ఆకలితో వస్తే వారి ఆకలి తీర్చే దే మెదక్ అని, మెతుకు సీమ అని అన్నారు. మెతుకు సీమలో రైతులు బాగుండాలని, రైతులకు అదనపు ఆదాయం చేకూరాలని ఆమూలు కంపెనీ ప్రతినిధులను అమిత్ షా గారిని కలిసిన సందర్భంలో ఆముల్ ఇండస్ట్రీ తూప్రాన్ లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి గారి, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ గడ్డం వి వెంకటస్వామి, శ్రీధర్ బాబు, ఇతర మంత్రుల సహాయ సహకారాలు ఎంతో తోడ్పాటుఅందించారని తెలిపారు . వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను మెదక్ జిల్లాకు పరిచయం చేయాలని తూప్రాన్ లో అముల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతన్న తన దినసరి ఖర్చులకు ఎవరి మీద ఆధారపడకుండా పాడి పరిశ్రమను నమ్ముకున్నట్లయితే తప్పనిసరిగా దినదినాభివృద్ధి చెందవచ్చు అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, కోపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కోల్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు లాభాలలో వాటా ఇవ్వాలి

ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 04

"సింగరేణి 2025...2026 వార్షిక లాభాలలో కాల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు లాభాలలో వాటా బోనస్ పది శాతం ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి రామ్ మోహన్ రావు అన్నారు.కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి వివిధ ప్రాంతాలకు బొగ్గు సరఫరా చేస్తున్న ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ల సమావేశం మోరే వెంకటేష్ అధ్యక్షతన టేకులపల్లి లో జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్పత్తితో. పాటు ట్రాన్స్పోర్ట్ లో ప్రధాన భూమిక పోషిస్తున్న కోలు ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు సింగరేణి లాభాలలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలు,మోరే, వెంకటేష్, చిరంజీవి,ప్రశాంత్, అశోక్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.




సైలని బాబా దర్గా వద్ద ఘనంగా ఆటో యూనియన్ గ్యారమి పండుగ...

నిజాంసాగర్ / అక్టోబర్ 04 (ప్రజా తీర్పు)

నిజాంసాగర్ నూతనంగా ఏర్పాటైన ఆటో యూనియన్ సభ్యులు ఆదివారం సైలాని బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆటోల ద్వారా ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రయాణం సాఫీగా సాగాలని, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని ప్రార్థించారు. ఆటో డ్రైవర్లు కూడా ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా చేరుకోవాలని దర్గా వద్ద మొక్కులు చెల్లించారు. నూతన యూనియన్ ద్వారా ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఖంఅ, ఆటో యూనియన్ అధ్యక్షుడు దుర్గయ్యతో పాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ మోహన్ రావు ని పరామర్శించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట అక్టోబర్ 4 ప్రజా తీర్పు ప్రతినిధి



నర్సంపేట పట్టణంలోని సీనియర్ డాక్టర్ మోహన్ రావు ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సార్లు మాపై జరా దయాచూపండి... కంకర పోసి వదిలేసిన రహదారి

- అధికారులు, కాంట్రాక్టర్ స్పందించక వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నెక్కొండ 04 అక్టోబర్ (ప్రజా తీర్పు ప్రతినిధి)




నెక్కొండ మండలం : రామన్నకుంట తండా, ఉప్పు తండా, రెసులబోడ్ తండాలను కలుపుతూ వెళ్లే రహదారి పనుల్లో నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై కంకర పోసి వదిలేయడంతో వాహనాలు వెళ్లే సమయంలో కంకర స్కిడ్ అవుతూ ప్రమాదకరంగా మారింది. కంకర పోసిన అనంతరం డస్ట్,రోలర్‌తో సక్రమంగా చదును చేయకపోవడంతో రహదారిపై కంకర చెల్లాచెదురుగా ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు, రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పలుమార్లు తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత, విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని వెంటనే కంకరను సక్రమంగా చదును చేసి డాంబర్ రోడ్డు రహదారి పనులను పూర్తి చేయాలని తండాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఈదుల గగన్ శశాంక్. పుట్టినరోజు వేడుకలు

- కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు

నర్సంపేట అక్టోబర్ 4 ప్రజా తీర్పు ప్రతినిధి



ఈదుల గగన్ శశాంక్ పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గగన్ తండ్రి ఈదుల కృష్ణ, తల్లి ఈదుల అరుణ, తమ్ముడు ఈదుల చర్విక్ అనే కలిసి కేక్ కట్ చేసి గగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గగన్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, జీవితంలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, తాను ఎంచుకున్న రంగంలో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు గగన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. కేక్ కట్ చేసి అనంతరం కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా గగన్‌కు పలువురు ఫోన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గగన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు ప్రేమాభిమానాలతో వేడుకలను నిర్వహించి గగన్‌కు మధుర జ్ఞాపకంగా నిలిచేలా పుట్టినరోజును ఘనంగా జరిపారు.

ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నేత జువ్వాడి రత్నాకర్ రావు

- ఘనంగా మాజీ మంత్రి 99వ జయంతి వేడుకలు
- రత్నాకర్ రావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

కోరుట్ల అక్టోబర్ 04 (ప్రజాతీర్పు)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ దేవాదాయ, ధర్మాదాయ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు తెలుగుజాతి మరువలేని మహానేత అని, ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ రాజకీయ వేత్త అని వక్తలు కొనియాడారు. రత్నాకర్ రావు 99వ జయంతిని పురస్కరించుకుని కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల వద్ద గల ఆయన కాంస్య విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు గాజంగి నందయ్య, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు, పీసీసీ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రత్నాకర్ రావు, పంచాయతీ సమితి ప్రెసిడెంట్‌గా, మెట్‌పల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి 1989, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించారని గుర్తుచేశారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో ఆలయాల అభివృద్ధికి, అర్చకుల సంక్షేమానికి ఆయన విశేష సేవలందించారని తెలిపారు. ముఖ్యంగా అర్చకుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు 'ధూప దీప నైవేద్యం' పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.కోరుట్ల పట్టణానికి ఇరువైపులా వెటర్నరీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసి పట్టణ రూపురేఖలను మార్చింది స్వర్గీయ రత్నాకర్ రావేనని స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోరుట్లలో సుమారు 4,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 80 ఇళ్లను తమ పార్టీ కార్యకర్తలకే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశామని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో నిలిచిపోయిన కొత్త రేషన్ కార్డుల మంజూరును కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతోందని, రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.అనంతరం స్వర్గీయ రత్నాకర్ రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా గుగులోతు తిరుపతి నాయక్

(వకుళాభరణశీ భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) అక్టోబర్ 04

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి ఎంతగానో సహకరించి, ఆశీస్సులు అందించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు సూచనల మేరకు, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ కు సహకరించిన బిజెపి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా, గిరిజన తండాలు గూడేలు ఎదుర్కొంటున్న సమస్యలపై , బిజెపి ఎస్టి మోర్చా బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాని



నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని చెప్పారు. భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను సర్థకతతో నిర్వహిస్తానని పునరుద్ఘాటించారు

గాంధీ జయంతి రోజే దళిత మహిళపై దాడి తీవ్రంగా ఖండించిన అంబేద్కర్ సంఘం.

- మహిళలపై దాడులు అరికట్టాలి – నత్తి మైసయ్య గర్జన.
- దళిత మహిళపై దాడి అమానుషం నిందితుడిపై కఠిన చర్యలు కోరిన సంఘం.
- అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో నిరసన స్వరం -- మహిళల రక్షణపై డిమాండ్.

మేడిపల్లి, అక్టోబర్ 4 (ప్రజాతీర్పు):



బోడుప్పల్ సర్కిల్:మహాత్మా గాంధీ జయంతి రోజున దళిత మహిళపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య తీవ్రంగా ఖండించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సంధిలోని బోడుప్పల్ సర్కిల్లో ఆదివారం 398వ వారంనాటి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ-- చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన గనిపల్లి మాధవి అనే దళిత మహిళపై అదే గ్రామానికి చెందిన కొప్పోలు అమర్నాథ్ గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దాడి చేయడం అమానుషమని అన్నారు. మహిళలపై ఇటువంటి దాడులు సమాజానికి మచ్చ తెచ్చే ఘటనలని, దీనిపై ప్రభుత్వం, పోలీసు శాఖ కఠినంగా స్పందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్న మహిళలపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య, సాయి బండారి, శ్రీధర్ గుప్తా, రాపోలు వెంకటేష్, చిల్ల అంజయ్య, గుంజి శ్రీనివాస్ (డింపు) తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను పిలిపించుకొని కనీసం మాట్లాడారా?

హుస్నాబాద్ అక్టోబర్ 04 రవీందర్ ప్రజా తీర్పు



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం భూ నిర్వాసితులకు మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక కనీసం భూ నిర్వాసితులను పిలిపించుకొని ఎప్పుడైనా మాట్లాడారా? అని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీళ్లు అందిస్తామని అనేక సార్లు మైకుల ముందు ఉపన్యాసలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా కూడా నేటి వరకు తట్టేడు మట్టి పోయకుండా ప్రజల దృష్టి మళ్ళిశేచడం కోసమే గౌరవెల్లి ప్రాజెక్టు పనుల పేరిట సమీక్షా సమావేశాలు పెట్టి కాలయాపన చేస్తున్నారు తప్ప చేసింది ఏమి లేదని అన్నారు. కనీసం పరిహారం తీసుకోకుండా మిగిలి పోయిన భూనిర్వాసితులను పిలిపించి వాళ్ళతో మాట్లాడే పరిస్థితి చేయడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం వారు చేసే పోరాటంకి మద్దత్తు తెలిపి మా ప్రభుత్వం వచ్చిన వెంటనే భూనిర్వాసితుల డిమాండ్స్ నేరవేర్చుతామని అనడం మాటల వరకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇక మిగిలింది రెండు సంవత్సరాలు మాత్రమే ఇంకా ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు? హుస్నాబాద్ మెట్ట ప్రాంతం. సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రాజెక్టును పూర్తి చేయక పోయినా అందులో నీళ్లు నింపితే భూగర్భ జలాలు అయినా అడుగంటకుండా ఉంటాయి. కనీసం ఇప్పటికైనా ఇవ్వలిసిన పరిహారం ఇప్పించి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని అన్నారు.



ఎల్లారెడ్డిపేటకు రెండు సబ్ స్టేషన్లుమంజూరు.. లోవోల్టేజీ సమస్యకు చెక్!

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 04(ప్రజా తీర్పు)

ఎల్లారెడ్డిపేట మండలానికి రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కావడంపై మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు పథిర--హరిదాస్‌నగర్, బండలింగంపల్లి గ్రామాల పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం మండల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడి దరాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులసమావేశంలో మాట్లాడుతూ.. బండలింగంపల్లి గ్రామంలో రూ.2.70 కోట్ల వ్యయంతో, పథిర--హరిదాస్‌నగర్ గ్రామాల పరిధిలో రూ.3.14 కోట్ల వ్యయంతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్లుగా ఉన్న లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందే అవకాశం ఉంటుందని రాజేందర్ తెలిపారు. సబ్‌స్టేషన్ల మంజూరుకు కృషి చేసిన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఎన్పీడీసీఎల్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గుండాటి రామ్‌రెడ్డి, వంగ గిరిధర్‌రెడ్డి, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, రంగ శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌కే సాహెబ్, నంది కిషన్, మండే శ్రీనివాస్, లింగం గౌడ్, శ్రీనివాస్, నారాయణ, రాములు, మూర్తి, వెంకటేష్, వంగ శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్, పోచయ్య, నరేందర్, ఇలియాస్ పాల్గొన్నారు.



వన్,టూడిపోల గౌరవ అధ్యక్షులుగా వైద్యుల అంజన్ కుమార్, రాచకొండ చక్రధర్ ఏకగ్రీవం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) అక్టోబర్ 04

కరీంనగర్ వన్, టూ డిపోల గౌరవ అధ్యక్షులుగా వైద్యుల అంజన్ కుమార్, రాచకొండ చక్రధర్ రావులు ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థలైన ఐఎన్టి యుసి, ఎస్డబ్ల్యూయు, టిడబ్ల్యూయు, ఎస్డబ్ల్యూఎఫ్, యూనియన్ నాయకులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అంజన్ కుమార్, రాచకొండ చక్రధర్ రావు మాట్లాడుతూ అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంద సంస్థ నుండి పోటీ చేసే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహుమతిగా ఇవ్వాలని అన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకువస్తే మంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు టిఆర్ రెడ్డి, రాజు,ఐఎన్టియుసి, ఎస్డబ్ల్యూయుటి,డబ్ల్యూయు, ఎస్డబ్ల్యూఎఫ్,వన్, టూ, డిపోలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి సంతకం చేయడానికి ఉపసర్పంచ్ లకు అభ్యంతరం లేదు

- జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం నాయకుడు చింతకింది సింగరయ్య

హుస్నాబాద్ అక్టోబర్ 04 రవీందర్ ప్రజా తీర్పు



గ్రామపంచాయతీ అభివృద్ధికి సంతకం చేయడానికి ఉపసర్పంచులకు ఎలాంటి అభ్యంతరం లేదని జిల్లా ఉప సర్పంచుల ఫోరం నాయకుడు చింతకింది సింగరయ్య అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప సర్పంచ్‌లు 7 రోజుల పాటు సంతకాలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని, వాటిని అమలు చేయాలనీ కానీ వాటికి తగిన పూర్తి ఆధారాలు ఉండాలని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం, గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం సంతకం చేయడానికి ఉప సర్పంచ్‌లకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే సంతకం చేసే బాధ్యత ఇచ్చినప్పుడు బిల్లులు, ఖర్చుల వివరాలు పరిశీలించే అవకాశం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే అధికారం కూడా కల్పించాలని కోరారు.

తక్కువ ఖర్చు అయిన పనులకి ఎక్కువ డబ్బులు రాసి ఒత్తిడి వస్తే, అలాంటి బిల్లులపై ఉప సర్పంచ్‌లు సంతకాలు చేయబోరని స్పష్టం చేశారు. అలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే సంబంధిత ఆధారాలతో కలెక్టర్ ని కలిసి వాస్తవాలను తెలియజేస్తామని అన్నారు. గ్రామపంచాయతీ నిధులు ప్రజల సొమ్ము అని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని తెలిపారు. అవినీతి, నిబంధనల ఉల్లంఘనకు ఉప సర్పంచ్ ఫోరం ఎప్పటికీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు.మేము జీతం తీసుకోకుండా గ్రామపంచాయతీ కోసం ప్రజాసేవ చేస్తున్నాం. అలాంటి ఉప సర్పంచ్‌లపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. మాకు బాధ్యతలు అప్పగిస్తే, ఆ బాధ్యతలకు తగిన అధికారాలు రక్షణ కూడా ఉండాలి అని అన్నారు.నిబంధనల ఉల్లంఘన జరిగితే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. తప్పులు నిర్ధారణ అయితే, నిబంధనల ప్రకారం సర్పంచ్ చెక్ పవర్‌పై ప్రభుత్వం సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



శిల్పారామం లో గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ ఆదివారం తో ముగిసింది

శేరిలింగంపల్లి, అక్టోబర్ 04 ప్రజా తీర్పు

శిల్పారామం మాదాపూర్ లో గత పది రోజులనుండి నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ ఆదివారం తో ముగిసింది. ఆదివారం యూ ఎస్ ఏ నుండి విచ్చేసిన కుం అంజలి సుఖవాసి కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. తరువాత సంగారెడ్డి మరియు సదాశివపేట నుండి విచ్చేసిన నాట్య గురువర్యులు శ్రీమతి జ్యోతి కులకర్ణి మరియు శ్రీమర్తి పూజ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో శివాష్టకం, రామచంద్రయ్య, కల్యాణ రామ, కృష్ణ శబ్దం, పరమ పురుషుడు, మొదలైన అంశాలను అనగా సూర్యనాశి, శ్రీవల్లి, నివేదిత, రుచిత, సాయి దీప, హరిణి, మహాలక్ష్మి, ప్రణీత మనుశ్రీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

నూతన పాక్స్ చైర్మన్లను అభినందించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 4.



జగిత్యాల పాక్స్ చైర్మన్‌గా కొలుగూరి దామోదర్ రావు, అల్లిపూర్ పాక్స్ చైర్మన్‌గా తంగెళ్ల రమేష్, ఇటిక్యాల పాక్స్ చైర్మన్‌గా మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్ నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషి చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నూతనంగా నియమితులైన పాక్స్ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పాక్స్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తూ, రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆకాంక్షించారు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ . ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం నూతన ఎస్సైగా ఎస్. శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) అక్టోబర్ 04



జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్ స్టేషన్ నూతన సబ్-ఇన్స్పెక్టర్ గా ఎస్. శ్రీకాంత్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన సతీష్ నిర్మల్ జిల్లాకు బదిలీ కావడంతో, గతంలో డీఎస్బీ, జగిత్యాల ఎస్బీలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన శ్రీకాంత్ ను నిర్మల్ జిల్లాకు బదిలీ చేయగా, ఆ ఉత్తర్వులను రద్దు చేసి జగిత్యాల జిల్లా బుగ్గారం ఎస్సైగా నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్య ఉన్నా బాధితులు నేరుగా తనను కలవవచ్చని భరోసా ఇచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతానని, రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళల సమస్యల పట్ల ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, మహిళలపై వేధింపులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని, పోలీస్ శాఖతో ప్రజలు సహకరించి ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు కృషి చేయాలని ఎస్సై కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఎస్. శ్రీకాంత్ కు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, ప్రజలు , అభినందనలు తెలిపారు.

కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ నరేందర్ రావుకు ఘన సన్మానం

(వినోద్, ప్రజా తీర్పు,?కుషాయిగూడ, మేడ్చల్) అక్టోబర్ 04



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన కుషాయిగూడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేందర్ రావును మిత్రబృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. ?పండుగకు సరిగ్గా ముందే బాధ్యతలు స్వీకరించిన సీఐ నరేందర్ రావు, గత 11 రోజుల పాటు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా నిరంతరం శ్రమించి సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగ్యనంద రావు, బిల్డర్ తోట నాగేష్, అడ్వకేట్ బాలరాజు, నర్సింగ్ రావు, పోచయ్య, సాదిక్, సాయి, బాలస్వామి తదితరులు పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మీ రిటైర్మెంట్ నిధి ఇలా..!

ప్రతి ఒక్కరికీ రిటైర్మెంట్ నిధి అవసరం. ఉద్యోగానంతర జీవితం సుఖమయం కావాలంటే అవసరాలకు సరిపడా నగదు నిల్వలు అందుబాటులో ఉండాలి. అందుకే ఎంత ఎక్కువగా కూడబెడితే.. అంత తేలిగ్గా వృద్ధాప్య సమస్యలను అధిగమించవచ్చు. మరి.. రిటైర్మెంట్ నిధికి ఉన్న మార్గాలేంటో చూద్దామా..

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)

ఇదో ప్రభుత్వ పథకం. ఉద్యోగులు (జీతాల్లో నుంచి), యాజమాన్యాలు కలిసి ఈపీఎఫ్‌కు నిధులను జమ చేస్తాయి. పదవీ విరమణ తర్వాత అవి అక్కరకు వస్తాయి. అయితే మధ్యమధ్యలో వివిధ అవసరాల నిమిత్తం తీసుకునే వెసులుబాటు కూడా ఉన్నది. కానీ అలా తీసుకోకపోతేనే (అత్యవసరమైతే తప్ప) చివరకు ఎక్కువ మొత్తాలు చేతికందుతాయి. పైగా ఈ సొమ్ముకు కేంద్ర ప్రభుత్వం చెల్లించే వడ్డీ కూడా ఆకర్షణీయంగా ఉంటుందని మరువద్దు.

రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్

స్టాక్, రుణ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్ కూడా ఉంటాయి. 5 ఏండ్లు లేదా పదవీ విరమణ వయసుదాకా లాకిన్ పీరియడ్ ఉంటుం ది. కానీ మార్కెట్ రిస్క్‌లకు లోబడి రాబడులుంటాయి. కాబట్టి పెట్టుబడులు పెట్టే ముందు మార్కెట్ నిపుణుల సలహాలు తీసుకోవడం ఉత్తమం.

పెన్షన్ ప్లాన్లు

బీమా సంస్థలు, బ్యాంకులు వివిధ పెన్షన్ ఫండ్ స్కీములను అందిస్తాయి. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), ఎన్‌పీఎస్ వాత్సల్య వంటి వాటిని ప్రధానంగా పరిశీలించవచ్చు.

గుర్తుంచుకోండి..

భవిష్యత్తు ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని, నెలవారీ ఖర్చులను అంచనా వేసి రిటైర్మెంట్ ప్లాన్ కోసం ముందుకెళ్లాలి. ఇక కేవలం ఒక్క ఆదాయ మార్గంపైనే ఆధారపడకుండా రకరకాల మార్గాలను అన్వేషించి అందిపుచ్చుకోవాలి. అలాగే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)కూ ప్రయత్నించాలి. ఆదాయం, పొదుపు, ఖర్చులపై ఏడాదికోసారైనా సమీక్ష చేయాలి. అనవసరపు ఖర్చులను దూరం చేస్తూనే ఆరోగ్య, జీవిత బీమాలకు పెద్దపీట వేయాలి.

చివరగా..

పిల్లల విద్య, తల్లిదండ్రుల అవసరాలనూ దృష్టిలో పెట్టుకోవాలి. ముఖ్యంగా నేడు పిల్లల చదువుకు అవుతున్న ఖర్చుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారి ఉన్నత విద్య అవసరాలు తీరాలంటే తప్పకుండా పెద్ద మొత్తాల్లో నగదు అవసరం. అందుకే ఈ బాధ్యతలను దృష్టిలో పెట్టుకుంటూనే మన రిటైర్మెంట్ ఫండ్ ప్లాన్ చేసుకోవాలి. రెండింటిలో దేనికో ఒకదానికి ప్రాధాన్యత ఇచ్చినా బ్యాలెన్స్ తప్పి లక్ష్యం దెబ్బ తింటుంది. అలాగే తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత. అందుకే వారి కోసం ఆరోగ్య బీమా, అత్యవసర వైద్య నిధి, ఇతరత్రా ఖర్చుల కోసం ఓ ఫండ్ ఉండాలి. దీనికి అనుగుణంగానే మీ రిటైర్మెంట్ నిధిని రూపొందించుకోవాలి.



జాయింట్ అకౌంట్ రూల్స్: ఒకరు మరణిస్తే.. మిగతా ఖాతాదారుడు డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చా..?

భార్యభర్తలు లేదా ఇతర వ్యక్తులు కలిసి నిర్వహించే జాయింట్ బ్యాంక్ అకౌంట్‌లో ఒకరు చనిపోతే.. ఆ డబ్బు మొత్తం బ్రతికున్న వారికి లేదా నామినీకి చెందుతుందా అనే సందేహం చాలామందికి ఉంటుంది. ఈ విషయంలో అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. బ్యాంక్ నియమాలు, చట్టపరమైన హక్కులు భిన్నంగా ఉండవచ్చు. జాయింట్ బ్యాంక్ అకౌంట్లు భార్యభర్తల మధ్య ఆర్థిక లావాదేవీలను మరింత సులువు చేస్తాయి. అయితే అకౌంట్ హోల్డర్లలో ఒకరు మరణించినప్పుడు.. ఆ అకౌంట్‌లోని డబ్బుపై అసలు హక్కు ఎవరిది అనే ప్రశ్న తరచుగా తలెత్తుతుంది. సర్వైవర్ లేదా నామినీకి డబ్బు అందినప్పటికీ.. వారు ఆ డబ్బుకు పూర్తి యజమానులు అవుతారా లేదా అనేది చాలామందికి తెలియని విషయం. చట్టపరమైన నిబంధనలు, బ్యాంకు ప్రక్రియలు, వారసత్వ చట్టాల వల్ల ఈ అంశం సంక్లిష్టంగా మారవచ్చు. అకౌంట్ హోల్డర్లలో ఒకరు మరణించినప్పుడు.. బ్యాంక్ సాధారణంగా మిగిలిన జాయింట్ అకౌంట్ హోల్డర్‌కు నిధులను విడుదల చేస్తుంది. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఇది సరైనదే అయినప్పటికీ.. చట్టపరంగా సర్వైవర్ ఆ డబ్బుకు పూర్తి యజమాని కాకపోవచ్చు. ఇండియన్ వారసత్వ చట్టాల ప్రకారం.. మరణించిన వ్యక్తి లీగల్ వారసులకు ఆ ఆస్తిపై హక్కు ఉంటుంది. సర్వైవర్ ఆ డబ్బుకు కేవలం ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలి. మరణించిన వ్యక్తి వారసులు తమ వాటాను డిమాండ్ చేస్తే, సర్వైవర్ వారికి ఆ వాటాను అందించాల్సి రావచ్చు. జాయింట్ అకౌంట్ హోల్డర్లు అందరూ మరణించినప్పుడు లేదా సింగిల్ అకౌంట్‌లో అకౌంట్ హోల్డర్ మరణించినప్పుడు బ్యాంక్ నామినీకి డబ్బు చెల్లిస్తుంది. అయితే నామినీ కూడా ట్రస్టీగానే పరిగణించబడతాడు. బ్యాంకింగ్ రెగ్యులేషన్స్ యాక్ట్ 1949 ప్రకారం.. బ్యాంకులు నామినీకి డబ్బు చెల్లించడం ద్వారా తమ బాధ్యతను నిర్వర్తిస్తాయి. కానీ, నామినేషన్ అనేది వీలునామా కాదు.

నయారా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు



నయారా ఎనర్జీ.. కొనుగోలుదారులకు షాకిచ్చింది. లీటర్ పెట్రోల్‌ను రూ.5, డీజిల్ ధరను రూ.3 పెంచి నట్టు ప్రకటిం చింది. అంతర్జా తీయ మార్కెట్లో ఇంధన ధరలు పెరగడం వల్లనే సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలను పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

ద్రవ్య సమీక్షపై ఆధారం.. గల్ఫ్ పరిణామాలూ కీలకమే

ద్రవ్య సమీక్షపై ఆధారం.. గల్ఫ్ పరిణామాలూ కీలకమే దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలతలు మదుపర్లను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి. ఓవైపు పశ్చిమాసియా సంక్షోభం, మరోవైపు వర్షాభావ పరిస్థితులు, ఇంకోవైపు ద్రవ్యోల్బణం భయాలు.. సూచీలను కోలుకోనివ్వడం లేదు. ఆగని విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలూ దెబ్బతీస్తున్నాయి.

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలతలు మదుపర్లను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి. ఓవైపు పశ్చిమాసియా సంక్షోభం, మరోవైపు వర్షాభావ పరిస్థితులు, ఇంకోవైపు ద్రవ్యోల్బణం భయాలు.. సూచీలను కోలుకోనివ్వడం లేదు. ఆగని విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలూ దెబ్బతీస్తున్నాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 1,986.04 పాయింట్లు పతనమై 71,909.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 718.55 పాయింట్లు క్షీణించి 22,421.95 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ఒడిదుడుకులకు వీలున్నదనే చెప్పవచ్చు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష కీలకం కానున్నది. ఇప్పటికే ఫెడ్ రిజర్వ్ సహా ఆయా విదేశీ సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను పెంచిన దృష్ట్యా.. ఈసారి దేశీయంగానూ వడ్డీరేట్లు పెరుగవచ్చనే అంచనాలున్నాయి. అదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు.అయితే వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచితే మార్కెట్‌కు ఒకింత ఉత్సాహమే. అలాగే అమెరికా-ఇరాన్ యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో ముడి చమురు-సహజ వాయువు ఆధారిత షేర్లూ సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొనే వీలున్నది. గత వారం హెల్త్‌కేర్, ఇన్సూరెన్స్ రంగాల షేర్లు భారీ నష్టాలకు గురయ్యాయి. ఈ వారం కూడా ఆ ప్రభావం కనిపించవచ్చు. ట్రంప్ నిర్ణయాలు, ఏఐ విస్తరణతో ఐటీ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం ఉన్నది. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం కూడా మార్కెట్ కదలికల్ని ప్రభావితం చేయగలవు. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 21,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 22,700-22,900 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చనీ చెప్తున్నారు.

ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ మధ్య తేడా ఏంటి?


రిజిస్ట్రేషన్



మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ద్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

మ్యూటేషన్

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యూటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యూటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యూటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి. తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యూటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.



పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేసేటప్పుడు ఈ మిస్టేక్స్ చేస్తున్నారా..? మీకు డబ్బులు రానట్లే..

పీఎఫ్ క్లెయిమ్ కోసం చాలామంది అప్లై చేస్తుంటారు. ఉద్యోగం మానేసిన తర్వాత లేదా ఉద్యోగం చేస్తున్నప్పుడు డబ్బులు అవసరమైనా మనీ విత్ డ్రా చేస్తారు. కొన్నిసార్లు చిన్న తప్పులు చేయడం వల్ల మీ క్లెయిమ్ రిజెక్ట్ అవుతుంది. ఎప్పుడెప్పుడు తిరస్కరణ అవుతుందంటే.. ఆర్థిక అవసరాల కోసం చాలామంది ఉద్యోగులు తమ పీఎఫ్ అకౌంట్లోని డబ్బులను విత్ డ్రా చేసుకుంటూ ఉంటారు. వివిధ కారణాలు చూపించి పీఎఫ్ ఖాతాలోని నిల్వలను సులువుగా ఆన్‌లైన్ ద్వారా ఎప్పుడైనా తీసుకోవచ్చు. ఇందుకోసం పీఎఫ్ పోర్టల్‌లోకి వెళ్లి క్లెయిమ్ సమర్పించాల్సి ఉంటుంది. అధికారుల పరిశీలన అనంతరం క్లెయిమ్‌కు ఆమోదం తెలిపితే డబ్బులు రెండు, మూడు రోజుల్లో మీ బ్యాంక్ అకౌంట్లో జమ అవుతాయి. ఇటీవల ఆటోమేటిక్ విధానం అమల్లోకి తీసుకురావడంతో అత్యంత వేగంగా డబ్బులు క్రెడిట్ అవుతున్నాయి. అయితే కొన్నిసార్లు చిన్న పొరపాట్ల వల్ల పీఎఫ్ క్లెయిమ్ తిరస్కరించే అవకాశముంది. ఏయే కారణాలు అనేది చూద్దాం.

క్లెయిమ్ ఎప్పుడు రిజెక్ట్ అవుతుంది..?

యూఏఎన్, ఆధార్ వివరాలు సరిపోలకపోవడం వల్ల పీఎఫ్ క్లెయిమ్ రిజెక్ట్ అవుతుంది. పీఎఫ్ అకౌంట్లోని మీ వివరాలు, ఆధార్ కార్డులోని వివరాలు ఒకేలా ఉండాలి. పేరు, డేట్ ఆఫ్ బర్త్, ఇతర ముఖ్యమైన సమాచారం ఒకేలా ఉండాలి. స్పెల్లింగ్ లేదా డేట్ ఆఫ్ బర్త్‌లో చిన్న తేడా ఉంటే క్లెయిమ్ తిరస్కరణకు గురయ్యే అవకాశముంది. ఇక పీఎఫ్ రికార్డుల్లో నమోదైన మీ బ్యాంక్ అకౌంట్ వివరాలు కరెక్ట్‌గా ఉండాలి. బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఖాతాదారుడి పేరు సరిగ్గా ఉండాలి. చిన్న పొరపాట్లు ఉంటే క్లెయిమ్ రిజెక్ట్ అవుతుంది. దీంతో పీఎఫ్ మనీ విత్ డ్రా కోసం అప్లై చేసేటప్పుడు మీ వివరాలు సరి చూసుకోండి. బ్యాంక్ అకౌంట్ మూతపడ్డా లేదా ఇనాక్టివ్ అయినా నిధులు బదిలీ అవ్వవు.

ఐపీవోలు అదుర్స్.. క్యూ3లో రూ 90 వేల కోట్లు సేకరించిన 69 దేశీయ సంస్థలు

ఒకవైపు స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ..మరోవైపు స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టే సంస్థలు మాత్రం వెనుకంజ వేయడం లేదు. చిన్నాచితక సంస్థల నుంచి కార్పొరేట్ల వరకు నిధుల సేకరణే అజెండాగా దూసుకుపోతున్నాయి. ప్రస్తుత సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఏకంగా 69 సంస్థలు రూ.90 వేల కోట్లకు పైగా నిధులను సేకరించాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.25 లక్షల కోట్లకు పైగా నిధులను సమీకరించినట్టు అయింది. విస్తృత మార్కెట్లో అస్థిరత కొనసాగుతున్నప్పటికీ..ప్రైమరీ మార్కెట్ మాత్రం దూసుకుపోతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు నిఫ్టీ 14 శాతం, సెన్సెక్స్ 15 శాతం చొప్పున పతనం చెందాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా అత్యంత బలహీన పనితీరు కనబరిచిన ప్రధాన ఈక్విటీ మార్కెట్లలో భారత్ కూడా ఒకటిగా నిలిచింది. గత మూడు నెలల్లో ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఎన్ఎస్ఈ అత్యధికంగా రూ.22 వేల కోట్లకు పైగా నిధులను సేకరించగా..ఎస్బీఐ ఫండ్స్ రూ.9,795 కోట్లు, మణిపాల్ హెల్త్ రూ.9,275 కోట్లు సేకరించాయి. ఈ మూడు సంస్థలే సగం నిధులను సమీకరించడం విశేషం.

బ్రాండ్‌కు పెద్దపీట

చిన్నాచితక సంస్థలు తమ బ్రాండ్‌కు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రైమరీ మార్కెట్లోకి అడుగుపెడుతున్నాయి. ప్రధానంగా ఎంఎస్ఎంఈలు వీటికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. తమ వ్యాపార విస్తరణకు, ఇతర అవసరాల నిమిత్తం సంస్థలు మార్కెట్లోకి వస్తున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ అధినేత అజిత్ మిశ్రా మాట్లాడుతూ..గత నెలలో ప్రైమరీ మార్కెట్ కార్యకలాపాలు గణనీయంగా వేగవంతమయ్యాయి..ఇది బలమైన దేశీయ ద్రవ్యత, సంస్థాగత డిమాండ్, మెరుగైన మార్కెట్‌ను ప్రతిబింబించే విధంగా ఉన్నాయన్నారు.



లైన్లో మరో 130 కంపెనీలు


స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి మరో 130 కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే వీటికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదముద్ర వేసింది. ఆయా సంస్థలు మొత్తంగా రూ.3.96 లక్షల కోట్ల నిధులను సమీకరించాలనుకుంటున్నాయి. ఇప్పటికే ఈ ఏడాదిలో 84 సంస్థలు రూ.1.10 లక్షల కోట్ల వరకు నిధులను సేకరించాయి. అలాగే 2016 నుంచి 2026 ఏడాది ఇప్పటి వరకు రూ.8.36 లక్షల కోట్ల వరకు నిధులను సేకరించాయి.

21 నుంచి జియో ఐపీవో!

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్..మెగా ఐపీవోకి సిద్ధమవుతున్నది. 3.8 బిలియన్ డాలర్లు లేదా రూ.37 వేల కోట్లకు పైగా నిధుల సమీకరణ లక్ష్యంగా..ఈ నెల చివర్లో ఐపీవోకి రాబోతున్నట్టు తెలుస్తున్నది. ఈ నెల 21న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై..ఈ నెల 23న ముగియనున్నట్టు కంపెనీ అనుబంధ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. యాంకర్ ఇన్వెస్టర్ల బుకింగ్ 19న జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. పబ్లిక్ ఇష్యూలో 27 కోట్ల తాజా షేర్లను కంపెనీ జారీ చేయనున్నట్టు ఇదివరకే సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్‌లో పేర్కొన్నది.

ఖతార్‌లో కలుద్దాం.. అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

ఖతార్‌లో కలుద్దాం.. అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్ రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు.



ండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు.ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బొన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆరంభ లోపాలను దాటి

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.




ఈ మెరుపులు సరిపోతాయా..
ఆసియాడ్‌లో భారత్‌కు మళ్లీ నాలుగో స్థానం
గత ఎడిషన్‌తో పోలిస్తే తగ్గిన 21 పతకాలు

ఆసియా ఖండాన్ని హోరెత్తించిన ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ హంగామా ముగిసింది. భారత్ మరోసారి టాప్4లో నిలిచింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు గెలిచింది. చివరి రెండు రోజుల్లో ఏకంగా 11 స్వర్ణాలు సాధించడంతో నాలుగో స్థానం ఖరారైంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ గత ఆసియాడ్‌తో పోల్చితే ఈసారి మన దేశం వెనుకబడింది. హాంగ్జౌలో 2023లో జరిగిన గత పోటీల్లో 28 స్వర్ణాలు సహా 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 21 స్వర్ణాలకే పరిమితమైంది. మొత్తంగా 21 పతకాలు, 7 స్వర్ణాలు తగ్గాయి. అదే సమయంలో చైనా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. 169 గోల్డ్ సహా మొత్తం 341 మెడల్స్‌తో మళ్లీ 'టాప్' లేపింది ఆతిథ్య జపాన్ 83 స్వర్ణాలు, 269 పతకాలతో రెండో స్థానం సాధిస్తే.. దక్షిణ కొరియా 39 పసిడి సహా 150 పతకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది.

28లో నిలబెట్టుకున్నది 8 స్వర్ణాలే

హాంగ్జౌలో సాధించిన 28 స్వర్ణ పతకాల్లో భారత్ 8 స్వర్ణాలను మాత్రమే తిరిగి గెలిచింది. ముఖ్యంగా వ్యక్తిగత, పెయిర్ (జంట) ఈవెంట్లలో వచ్చిన 13 స్వర్ణాల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. అదే సమయంలో కొత్తగా 13 విభాగాల్లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా అవతరించడం మాత్రం భవిష్యత్తుపై ఆశలు రేపుతోంది. అంటే భారత్ వద్ద కొత్త ప్రతిభ కొరవడలేదు. ఆ ప్రతిభను నిరంతర విజయాలుగా మార్చడం, ఒక తరం నుంచి మరో తరానికి విజయాలను కొనసాగించడం ఇప్పుడు అసలు సవాలుగా మారింది.

సబలెంకాకు షాక్.. సెమీస్‌కు నొవాక్



చైనా ఓపెన్ డబ్ల్యూటీఏ1000 టోర్నమెంట్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్, నాలుగు గ్రాండ్‌స్లామ్స్ చాంపియన్ అరీనా సబలెంకాకు షాక్ తగిలింది. మూడో రౌండ్‌లోనే టోర్నీ నుంచి వైదొలిగింది. ఆదివారం జరిగిన పోరులో చెక్ రిపబ్లిక్ అమ్మాయి, 34వ ర్యాంకర్ నిబార్టుంకోవా 6-4, 6-3తో సబలెంకాను ఓడించి సంచలనం సృష్టించింది. మరో మ్యాచ్‌లో రష్యా స్టార్ మీరా ఆండ్రీవా 6-4, 6-1తో కుదెర్మెతోవాను ఓడించి ముందం జ వేసింది. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో సెర్బియా లెజెండ్ నొవాక్ జొకోవిచ్ 4-6, 6-4, 6-4తో టాప్ సీడ్, యూఎస్ ఓపెన్ విన్నర్ జ్వెరెవ్ (జర్మనీ)ని ఓడించి సెమీస్ చేరాడు.

ఇరానీ కప్ రెస్టాఫ్ ఇండియాదే.. జమ్మూపై ఘన విజయం



పేసరు ముకేశ్ కుమార్ (6/33), ఆకాశ్ దీప్ (3/25) ఖతర్నాక్ బౌలింగ్‌తో విరుచుకుపడటంతో రంజీ ట్రోఫీ చాంపియన్ జమ్మూ కాశ్మీర్‌ను చిత్తు చేసిన రెస్టాఫ్ ఇండియా ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌ను కైవసం చేసుకుంది. నాలుగు రోజుల్లోనే ముగిసిన ఈ పోరులో రిషబ్ పంత్ కెప్టెన్సీలోని రెస్ట్ టీమ్ 167 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆదివారం 279 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూ.. రెస్ట్ బౌలర్ల దెబ్బకు 111 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు శుభమ్ ఖజూరియా (36), ఖమ్రాన్ ఇక్బాల్ (32) తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించి మంచి ఆరంభాన్ని ఇవ్వగా లంచ్ సమయానికి 89/3తో కాస్త మెరుగ్గానే నిలిచిన జమ్మూను రెండో సెషన్‌లో ముకేశ్, ఆకాశ్ దెబ్బకొట్టారు. 22 పరుగుల వ్యవధిలోనే చివరి 6 వికెట్లను పడగొట్టారు.



అమ్మ బాటలో నడవాలని.. అంతర్జాతీయ క్రికెట్‌కు పాకిస్థానీ పేసర్ వీడ్కోలు..!

అంతర్జాతీయ క్రికెట్‌కు పాకిస్తాన్ పేసర్ కైనత్ ఇంతియాజ్(ఖుఅఅఖ ×వీఱుఓ) వీడ్కోలు పలికింది. పదమూడేళ్ల పాటు జట్టుకు సేవలందించిన తను సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్నట్టు ఆదివారం ప్రకటించింది. మూడేళ్ల క్రితం చివరి మ్యాచ్ ఆడిన తను ఇక అవకాశాలు రావని తెలిసి ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై తన తల్లి సలీమా ఇంతియాజ్(ఝుశ్రీవవఝుం ×వీఱుఓ) బాటలో నడవాలని అనుకుంటుంది తను. అమ్మ మాదిరిగానే తాను కూడా మ్యాచ్ రిఫరీ కావాలనే ఉద్దేశంతోనే ఆటకు అల్విదా చెప్పానని కైనత్ పేర్కొంది. పాకిస్తాన్ మహిళా క్రికెటర్ కైనత్ ఇంతియాజ్ రిటైర్మెంట్ ప్రకటించింది. దాదాపు పదమూడేళ్ల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించిన తను ఆదివారం అల్విదా చెప్పేసింది. తదుపరి మ్యాచ్ రిఫరీగా కొనసాగాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆమె చెప్పింది. అమ్మ సలీమా ఇంతియాజ్ తరహాలోనే తను కూడా అంతర్జాతీయంగా రిఫరీగా రాణించాలని భావిస్తున్నట్టు పేర్కొందీ పేసర్. ఇటీవలే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నిర్వహించిన జాతీయ మహిళల అండర్-19 టోర్నమెంట్‌లో రిఫరీగా వ్యవహరించింది ఇంతియాజ్.

2010లో అరంగేట్రం

కుడిచేతివాటం పేసరైన ఇంతియాజ్ 2010లో దక్షిణాఫ్రికాపై టీ20తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిసింది. ఆపై ఐర్లాండ్ మ్యాచ్‌తో వన్డేల్లో డెబ్యూ క్యాప్ అందుకుంది. అయితే.. ఎందుకనో తనకు పెద్దగా అవకాశాలు రాలేదు. పదమూడేళ్ల కాలంలో తను కేవలం19 వన్డేలు, 21 టీ20లు ఆడిందంతే. వన్డేల్లో 10 వికెట్లు.. పొట్టి క్రికెట్‌లో ఎనిమిది వికెట్లు తీసింది.



ధోనీ సలహాతో భారత్‌ను ఓడించా.. షాయ్ హోప్..!

నామమాత్రమైన మూడో వన్డేలో అద్భుత శతకంతో క్వీన్‌స్వీప్ తప్పించాడు వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్(ష్రష్ట్రుఱ ఽశీజూవ). భారత బౌలర్లను కాచుకొని అజేయంగా నిలిచి అతడు జట్టును గెలిపించిన తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానం సందర్భంగా హోప్ మాట్లాడుతూ.. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ(మీా ణష్ట్రశీఅఱ) సలహాతోనే టీమిండియాను ఓడించానని చెప్పాడు. కొన్ని రోజుల క్రితం ధోనీ చెప్పిన మాటలే తనను మ్యాచ్ విన్నర్‌ను చేశాయని వెల్లడించాడీ విండీస్ సారథి. వరసగా రెండో వన్డేల్లో కంగుతిన్న వెస్టిండీస్ ఛండీగఢ్‌లో గొప్పగా పోరాడింది. కెప్టెన్ షాయ్ హోప్(162 నాటౌట్) సూపర్ సెంచరీతో కదంతొక్కగా వైట్‌వాష్ తప్పించుకుంది విండీస్. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ క్రీజులో పాతుకుపోయిన హోప్.. ఇన్నింగ్స్ నిర్మించిన తీరు, రన్‌రేటు తగ్గకుండా గేర్ మార్చి ఆడిన విధానం గొప్పగా ఉంది. ఒకప్పుడు చిన్న స్కోర్లకే వెనుదిరిగే అతడిని 'ఈమధ్య భారీ స్కోర్లతో రాణించడానికి కారణం ఏంటీ?' అని అడుగగా.. ఎంఎస్ ధోనీ పేరు చెప్పాడు. 'ఓసారి ధోనీతో గొప్ప సంభాషణ జరిగింది. నీవు అనుకునేదానికంటే ఎక్కువ సమయం నీకు ఉంటుంది. అందుకు చివరి ఫలితం గురించి ఎక్కువగా ఆలోచించకు. క్రీజులో ఉండి పరుగులు సాధించు. నీ స్టయిల్లో లక్ష్యాన్ని తగ్గిస్తూ వెళ్లు. ఆఖర్లో బౌండరీలపై దృష్టి పెట్టు అని ధోనీ నాకు సలహా ఇచ్చాడు' అని హోప్ వెల్లడించాడు. అంతేకాదు భారత జట్టు స్లో ఓవర్ రేటు కూడా విండీస్‌కు కలిసొచ్చిందని అతడు తెలిపాడు. మ్యాచ్‌లో టీమిండియా ఎన్ని ఓవర్లు వెనకబడి ఉందో తెలిసింది.



సింగిడి రంగులలో పొంగే ఆకాశం..

తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో ఓ పెళ్లి చుట్టూ జరిగే కథతో తెరకెక్కిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, నరేష్ వీకే, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. భద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రేమ, పెళ్లి, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో హాస్యం, భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని మేకర్స్ తెలిపారు. శనివారం ఈ సినిమా నుంచి 'అల సెంద్రవంక' అనే రెండో పాటను విడుదల చేశారు. ప్రముఖ ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్న రచించిన ఈ గీతానికి సురేష్ బొబ్బిలి స్వరాల్ని అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 'అందం మురిసే, గంధం కురిసే పిల్లా నీ మేని సొగసులనే చూసి, వేకువలోనా వెన్నెల కాసి, పిల్లా నీ పెదవులపై నవ్వే పూసే, నీ అడుగులతోనే అవనే పులకించే, నీ తనువును తాక మేఘం తలవంచే, సింగిడి రంగులలో పొంగే ఆకాశం' అంటూ అందమైన భావాలతో ఈ పాట సాగింది.

నాన్న కోసమే ఆ సినిమా చేశా.. ఇండస్ట్రీ వదిలేద్దామనుకున్నా : శ్రుతిహాసన్



విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ.. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్. నటనతో పాటు గాయనిగా, సంగీతంపై ఆసక్తి ఉన్న ఆర్టిస్ట్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంది. అయితే సినీ ప్రయాణం ప్రారంభమైన సమయంలో మాత్రం ఆమె కెరీర్‌పై ఎన్నో సందేహాలు ఉండేవట. విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ.. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్. నటనతో పాటు గాయనిగా, సంగీతంపై ఆసక్తి ఉన్న ఆర్టిస్ట్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంది. అయితే సినీ ప్రయాణం ప్రారంభమైన సమయంలో మాత్రం ఆమె కెరీర్‌పై ఎన్నో సందేహాలు ఉండేవట. ముఖ్యంగా తాను నటించిన ఓ సినిమా విషయంలో శ్రుతి హాసన్‌కు తనపైనే నమ్మకం తగ్గిపోయిందట. శ్రుతి హాసన్‌కు సినిమాలతో పరిచయం చిన్న వయసులోనే ఏర్పడింది.



విశ్వక్‌సేన్ 'కల్ట్' విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కల్ట్'. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020